Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైయిటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 202 విశాఖపట్నం, 24 మే 2024 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## కౌంటింగ్ నిర్వహణకు 3 అంచెల భద్రత



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా ఫలితాలను వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై సమీక్షించారు.

జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ లో భాగస్వామ్యమయ్యారు.

ఈ సందర్భంగా కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపట్టిన చర్యలను జిల్లా ఎన్నికల అధికారి సీఈవోకు వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, మూడంచెల విధానంలో భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 500 మంది సివిల్ పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. 176 సీసీ కెమెరాలు అమర్చామని, వాటిని మానిటరింగ్ రూమ్ కు అనుసంధానం చేసి రోజువారీ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఏయూ పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని, నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఒక్కో టేబుల్ కు గాను ఒక్కో కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంటు, ఒక్కో మైక్రో అబ్జర్వర్ను నియమించామని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నామని, దానికి గాను రెండు హాళ్లను గుర్తించామని, 18 టేబుళ్లను

(మిగతా 2లో)

## పిన్నెల్లిని త్వరలోనే అరెస్టు చేసి తీరుతాం : సీఈవో ఎంకే మీనా

**అమరావతి:** మాచర్ల నియోజకవర్గం పరిధిలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో సరైన సమాచారం ఇవ్వనందుకు విధుల్లో ఉన్న పీవో, ఏపీవోలను సస్పెండ్ చేయాలని ఆదేశాలిచ్చినట్టు సీఈవో ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసేందుకు ఎస్పీ, డీఎస్పీలతో 8 పోలీసు బృందాలు పనిచేస్తున్నాయన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు విషయంలో ఈసీ సీరియస్‌గా ఉందని, త్వరలోనే అరెస్టు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాచర్ల నియోజకవర్గంలో గాయపడిన కార్యకర్తల్ని పరామర్శించేందుకు తెదేపా నేతలు వెళ్లటం ఇప్పుడు మంచిది కాదని, ఇప్పుడిప్పుడే పరిస్థితులు అదుపులోకి వస్తున్నాయన్నారు. పరామర్శలకు ఈ సమయంలో వెళ్లొద్దని రాజకీయ నేతలకు విజ్ఞప్తి చేశారు.



“బయటి నుంచి నేతలెవరూ పరామర్శకు వెళ్లకూడదు, ఎవరినీ ఆ గ్రామాలకు వెళ్లనీయొద్దని సూచనలు జారీ చేశాం. పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన దృశ్యాలు ఈసీ నుంచి బయటకు వెళ్లలేదు. దర్యాప్తు సమయంలో ఎక్కడో.. ఎవరి చేతి నుంచో బయటకు వెళ్లాయి. ఈనెల 25 నుంచి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించేందుకు రాష్ట్రంలో పర్యటిస్తా” అని ఎంకే మీనా తెలిపారు.

జూన్ 4న ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సీఈవో ఎంకే మీనా ఆదేశాలు జారీ చేశారు. ఫలితాలను కచ్చితత్వంతో త్వరితగతిన ప్రకటించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపులో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఎన్ని టేబుళ్లు, ఎన్ని రౌండ్ల లెక్కింపు అనే విషయాలను తెలియజేయాలని సూచించారు.

“కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక మీడియా సెంటర్లు ఏర్పాటు చేయాలి. కౌంటింగ్ సంబంధిత వివరాలను అభ్యర్థులు, ఏజెంట్లకు ముందుగానే తెలియజేయాలి. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంల తరలింపు మార్గాలు, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలి. బారికేడ్లు, సూచికలను కూడా ఏర్పాటు చేయాలి. అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి ఓట్ల లెక్కింపు టేబుళ్లను ఏర్పాటు చేయాలి. పోస్టల్

(మిగతా 2లో)

## కేంద్రాలవారీగా పోలింగ్ శాతం వెల్లడి ఇబ్బందే

### సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం



పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ శాతం వివరాలు ఎన్నికల వెబ్ సైట్ లో వెల్లడి చేయడం ఇబ్బందికరమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అలా చేస్తే ఎన్నికల యంత్రాంగం గందరగోళంలో పడుతుందని వివరించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో ఎన్నికల కమిషన్ అఫిడవిట్ దాఖలు చేసింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వివిధ దశల్లో నమోదవుతున్న పోలింగ్ శాతాలను ఈసీ సకాలంలో ఇవ్వలేకపోవడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది.

దీనిపై ఎన్నికల సంఘం సుప్రీం కోర్టుకు సమాధానమిస్తూ ....ఎన్నికలు జరుగుతున్న సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ శాతం సమాచారాన్ని వెల్లడిస్తే అది గందరగోళ పరిస్థితులకు దారితీస్తుందని వివరించింది. ప్రతి విడతలోనూ పోలింగ్ ముగిసిన 48 గంటల్లోనే పోలింగ్ శాతం వివరాలను ఈసీ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

ఈ క్రమంలోనే ప్రతి పోలింగ్ స్టేషన్లో పడిన ఓట్ల సంఖ్యను తెలిపే ఫామ్ 17 సీ పత్రాన్ని బహిర్గతం చేయాలనే నిబంధన ఎక్కడా లేదని సుప్రీంకోర్టుకు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఫామ్ 17 సీ ను స్ట్రాంగ్ రూమ్ లోనే భద్రపరుస్తున్నామని, కేవలం పోలింగ్ ఏజెంట్

(మిగతా 2లో)

## మే 24వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు ప్రేలుడు పదార్థాల తయారీ, విక్రయం, వినియోగం నిషిద్ధం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈనెల 24వ తేదీ నుండి వచ్చేనెల 6వ తేదీ వరకు జిల్లాలో ఎటువంటి పేలుడు సామగ్రి, పదార్థాలు తయారు చేయడం, అమ్మడం, వాటిని ఉపయోగించడంపై నిషేదం విధించినట్లు అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీదార్లు, పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తయారీదారులు ఎటువంటి



పేలుడు పదార్థాలను తయారు చేయరాదని, దానికి సంబంధించిన సామగ్రి, తయారు చేసిన వస్తువులు అమ్మకూడదని చెప్పారు. పేలుడు పదార్థాలను ఎవరు


(మిగతా 2లో)

## ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్స్ స్వాధీనం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** చోరీ కేసులో నిందితులు నుంచి ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ద్వారకా జోన్ సీఐ సి హెచ్. శ్రీనివాసరావు తెలిపారు ఆయన మాట్లాడుతూ తమిళ నాడుకి చెందిన ఇద్దరు యువకులు గణేష్ శంకర్,మంజునాథన్ మహా

(మిగతా 2లో)





## ఏపీ ఈఏపీ సెట్ ప్రిలిమినరీకీ విడుదల



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీసెట్ (అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్) పరీక్ష ప్రిలిమినరి కీ విడుదలైంది. ప్రాథమిక కీతో పాటు మాస్టర్ క్వశ్చన్‌పేపర్లు, రెస్పాన్స్ షీట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ పరీక్ష రాసిన అభ్యర్థులు ఈ నెల 25 ఉదయం 10గంటల్లోపు

(మిగతా 2లో)

## ఏపీలో జూన్ 4న ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం



**అమరావతి:** ఏపీలో జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పలు జిల్లాల ఎస్పీలు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజున ర్యాలీలు, ఊరే గింపులకు అనుమతులు రద్దు చేస్తున్నట్లు పోలీస్ శాఖ ప్రకటించింది. అలాగే బాణసంచా విక్రయంపై

(మిగతా 2లో)

## జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార బద్రత సాధ్యపడుతుంది



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార బద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వై.ఎస్.ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి. జానకీరామ్ అన్నారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ సంపద తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారాలు పెరిగిపోవడం ముప్పుకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంఘటితంగా, ప్రణాళికా బద్ధంగా పనిచేయాల్సిన అవశ్యకతను వివరించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతీ వ్యక్తి మారాల్సిన అవసరం ఉందన్నారు. సర్వప్రాణి సేవ భగవంతుని సేవగా నిలుస్తుందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర ప్రాణులపైన కూడా ప్రభావం చూపుతున్నాయన్నారు.

నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్ సభ్యులు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక్క డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిట్ ప్రాంతాలపై ఉష్ణోగ్రతల ప్రభావం, పర్యవసానాలను వివరించారు. ఏపి బయో డైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావంగా జీడీపీ దెబ్బతింటుందన్నారు. పర్యాటకం పేరుతో జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే దాని ప్రభావం ప్రతీ వ్యక్తి జీవితంపై

(మిగతా 2లో)

## ఆహ్వానం



ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువులు, విజయవాడ దరి గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో వేంచేసి యున్న భువనేశ్వరీ పీఠం యొక్క పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ కమలానంద భారతి స్వామి వారు ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం విశాఖ నగరంలోని శంకర మఠం ఏసీ హాలు నందు అద్భుతమైన ప్రసంగం చేయనున్నారు.

విషయం
దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమాల నిర్వహణ.
ఈ సందర్భంగా శ్రీ స్వామి వారు దేవాలయాల లో ఆచరించవలసిన విధులు, విధానాలు, ఆచారాలు వంటి విలువైన విషయాలు వివరిస్తారు. ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వారికి ఉపయోగపడే అనేక విశేషాలు స్వామి వారిని అడిగి తెలుసుకోవచ్చు.
దేవాలయ నిర్వహణ కమిటీలవారు, అర్చకులు, ఆధ్యాత్మిక రంగంలో ఉన్న వారికి మా ప్రత్యేక ఆహ్వానం.
కార్యక్రమ వివరాలు:
తేదీ 26-5-2024. ఆదివారం
వేదిక: శ్రీ శంకర మఠం
ద్వారకా నగర్, విశాఖపట్నం.
సభ ప్రారంభం: ఉదయం 9 గంటలకు.
ప్రశ్నోత్తరాలు: 12 గంటలకు.
శ్రీ స్వామి వారికి పౌర సన్మానం: 12.30 లకు.
వివరములకు: శ్రీ కమలానంద భారతి స్వామి వారి భక్త బృందం, విశాఖపట్నం.
ఫోన్: 93939 49345.

(మొదటి పేజీ తరువాయిలు)

## కౌంటింగ్ నిర్వహణకు 3 అంచల భద్రత

కేటాయించామని వివరించారు. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరొక 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని అసెంబ్లీలకు వచ్చేసరికి పార్లమెంటుతో కలిపే అన్ని ఏర్పాట్లు చేశామని అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరొక మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయని స్పష్టం చేశారు. అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు గాను ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుందని వెల్లడించారు. 24 మంది అదనపు ఏఆర్వోలు, 33 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 57 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 33 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని జిల్లా కలెక్టర్ వివరించారు.

సంబంధిత అధికారులకు, సిబ్బందికి నిర్ణీత కాలంలో శిక్షణ అందిస్తామని, ఈ నెల 25న తొలి విడత ర్యాండమైజేషన్, జూన్ 2వ తేదీన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.

బ్యాలెట్ల లెక్కించాకే, ఈవీఎంల లెక్కింపు మొదలు కావాలి. ఈసీ నిర్వహించే ఎన్‌కోర్ వెబ్ అప్లికేషన్‌లో ఫలితాలను వెంటనే అప్‌లోడ్ చేయాలి. అనధికార వ్యక్తులు, గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించొద్దు. లెక్కింపు పూర్తయ్యే వరకు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత కొనసాగుతుంది" అని మీనా స్పష్టం చేశారు.

## కేంద్రాలవారీగా పోలింగ్ శాతం వెల్లడి ఇబ్బందే

కు మాత్రమే ఆ కాపీని పొందేందుకు అనుమతి ఉందని వివరించింది. పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ శాతం వివరాలు వెల్లడిస్తే ఆ సమాచారాన్ని ఇతర వ్యక్తులు మార్ఫింగ్ చేసి, దుర్వినియోగపరిచే అవకాశాలున్నాయని ఎన్నికల సంఘం తెలిపింది. దీనివల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో లేనిపోని అపనమ్మకం ఏర్పడే అవకాశముందని తెలిపింది.

## మే 24వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు ప్రేలుడు పదార్థాల తయారీ, విక్రయం, వినియోగం నిషిద్ధం

ఉపయోగించినా వారిపై 13 ఎక్స్ ప్లోసింగ్ యాక్ట్ ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పండుగలు, ఉత్సవాలు జరిగినా పేలుడు సామగ్రి వాడకుండా నిషేదాజ్ఞను వున్నాయన్నారు. పెట్రోల్ విడిగా అమ్మకూడదని, అమ్మేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మైన్స్ బ్లాస్టింగ్ జిలిటిన్ స్టిక్స్ కూడా ఇతరులు వాడరాదని, మైన్స్ వాడకం దార్లనుండి డిక్లరేషన్ తీసుకోవాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి మాట్లాడుతూ ఊరేగింపులు, సంబరాలకు అనుమతులు లేవన్నారు. అగ్నిమాపక, మైన్స్ అధికారులు క్షేత్ర పర్యటనలు తనిఖీలు ఎక్కువ చేయాలని సూచించారు. ఎవరైనా వచ్చి పేలుడు పదార్థాలు అడిగినట్లయితే వెంటనే దగ్గరలోని పోలీసు అధికారులకు తెలియజేయాలని అమ్మకందార్లకు చెప్పారు. పై దినాలలో నిరంతర నిఘా వుండాలన్నారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి. నర్సీపట్నం డి.ఆర్.ఆర్.మోహన్ జిల్లా అగ్నిమాపకాధికారి ఆర్.వి.రమణ జిల్లాలోని పెట్రోల్ కంపెనీల సేల్స్ మేనేజర్లు, పేలుడు పదార్థాల వినియోగదార్లు, తయారీదార్లు పాల్గొన్నారు.

## ఆరు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్స్ స్వాధీనం

రాష్ట్రవిశాఖలో చోరీలు చేసి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు వేరు 2021 నుంచి ఇక్కడ నేరాలు చేస్తున్నారు ఇక్కడ15 రోజుల్లో మూడు చోరీలు చేశారు భీమిలి, ఆనందపురం లో కూడా వీరి మీద చోరీ కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు వీరిని వెంకోజీపాలెం జంక్షన్ వద్ద అరెస్ట్ చేశామన్నారు గణేష్ శంకర్ కి భార్య,నలుగురు పిల్లలు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు మీడియా సమావేశం లో ఎంవీపీ స్టేషన్ క్రైమ్ ఎస్ఐ ఎన్.జగదీష్ పాల్గొన్నారు.

## ఏపీ ఈఏపీ సెట్ ప్రిలిమినరీకీ విడుదల

అభ్యంతరాలు తెలపవచ్చు. తెలియజేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా మే 16, 17 తేదీల్లో ఈఏపీసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అగ్రికల్చర్-ఫార్మసీ, ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లకు కలిపి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.61లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 18న ప్రారంభమైన ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు నేటితో ముగియనున్నాయి.

## ఏపీలో జూన్ 4న ర్యాలీలు, ఊరేగింపులపై నిషేధం

కూడా నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. టపాసులు విక్రయించినా, కాల్చినా బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు...

## జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార బద్రత సాధ్యపడుతుంది

ఉంటుందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విభాగాధిపతి ఆచార్య కె.సంధ్య దీపిక తదితరులు ప్రసంగించారు.

కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, ఏపి బయోడైవర్సిటీ బోర్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సదస్సులో విభిన్న ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరపున అతిథులను సత్కరించారు.

# 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ నిర్వహించిన అనకాపల్లి జిల్లా పోలీసులు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జూన్ 1వ తేదీన ఎగ్జిట్ పోల్స్ మరియు జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలు - 2024 కౌంటింగ్ ఉన్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, వారి సమక్షంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అర్మ్డ్ రిజర్వు మరియు లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బందితో అనకాపల్లి పట్టణం, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద "మాబ్ ఆపరేషన్"మాక్ డ్రిల్" నిర్వహించారు.


ఏవైనా అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, 144 సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో, ప్రజల శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదరగొట్టాలి అనే పద్ధతిలో భాగంగా అక్రమ జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇచ్చుట, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్ గ్యాస్ ప్రయోగించుట, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ చార్జ్, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికి పరిస్థితి అదుపులోకి రాని ఎడల ఫైరింగ్ చేయుట వంటివి ఈ మాక్ డ్రిల్ లో ప్రదర్శించారు.

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమయంలో పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీములు ఏర్పాటు చేయడం జరిగిందని. ప్రశాంత వాతావరణంలో ప్రజాజీవనం జరిగేలా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు అనకాపల్లి టౌన్ ఫోర్ రోడ్ జంక్షన్ లో ఈ మాక్ డ్రిల్ చేయడం జరిగిందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు.

మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది మరియు ఫైర్ సర్వీస్ అధికారి నర్సింగరావు మరియు సిబ్బందినీ అభినందించిన జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ ఎస్.అప్పలరాజు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి. సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, ఎస్.బి డీఎస్పీ అప్పారావు, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్స్పెక్టర్లు మన్మధరావు, సతీష్, శంకరరావు, శ్రీనివాసరావు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు అత్యంత కీలకం



విజయనగరం, మే 23 : ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టే ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బంధీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్ఓలు, ఎఆర్ఓలు, డిటిలు, నోడల్ అధికారులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కలెక్టరేట్ ఆడిటోరియంలో తొలివిడత అవగాహన, మరియు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దని, ప్రతీఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం ఈ ప్రక్రియపై అందరూ సమగ్ర అవగాహన కల్పించుకోవాలని సూచించారు. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు లెండి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, అందువల్ల సిబ్బంది అంతా 6 గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకొని, అంతా సిద్దం చేసుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఒకవైపు ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు, మరో వైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున, లెక్కింపు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విజయనగరం పార్లమెంటు స్థానం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు మాత్రం లెండి కళాశాలలోనే నిర్వహిస్తామని తెలిపారు. దీనికోసం 20 టేబుళ్లతో పెద్ద హాలును సిద్దం చేస్తున్నామన్నారు. ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో హాలులో 14 టేబుళ్లను సిద్దం చేస్తున్నామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం మొత్తం 8 గదులను, ఇవిఎం ఓట్ల లెక్కింపు కోసం 14 హాళ్లను సిద్దం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ గదిలో సిసి టివి ఉంటుందని, ఇవిఎంలు తీసుకువచ్చిన దగ్గరనుంచి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు వీడియో రికార్డింగ్ కూడా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ధరించాలని, అవిలేకపోతే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు.,పోస్టల్ బ్యాలెట్ లెక్కించే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తొలివిడత లెక్కింపు, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. కౌంటింగ్ హాలులో రిటర్నింగ్ అధికారులదే సర్వాధికారమని, వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఓ ఎస్‌డి అనిత, ట్రైనింగ్స్ నోడల్ ఆఫీసర్ సుధాకరరావు, ఆర్ఓలు పాల్గొన్నారు.

## కూటమి విజయం ఖాయం : తెలుగుదేశం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రంలో కూటమి పార్టీల విజయం ఖాయం అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. స్థానికం గా గురువారం విడుదల చేసిన పత్రిక ప్రకటన లో ఆయన పేర్కొంటూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలం లో ప్రజలు నష్టపోయారని ఆయన ఆరోపించారు. జగన్ పాలన తో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కలయిక కూటమిని ఆదరించారని ఆయన పేర్కొన్నారు. జూన్ 4 న జరగనున్న ఓట్ల లెక్కింపు లో కూటమికి 120 నుండి 130 వరకు సీట్లు వచ్చి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయం అని జూన్ 9 న ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు మేలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

| | |
|---|---|
| పంచాంగం | శుక్రవారం 24-05-2024<br>క్రోధి నామ సంవత్సరము<br>ఉత్తరాయణం, వసంతరుతువు<br>వైశాఖమాసం |
| తిథి | : బ. పాడ్యమి సా. 06.45 |
| నక్షత్రం | : అనూరాధ ఉ. 09.59 |
| వర్జ్యం | : ప. 02.56 ల 04.35 |

## ఓట్ల లెక్కింపు నిబద్ధతతో, నిర్భయంగా చేయాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు నిబద్ధతతో, నిర్భయంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో మాస్టర్ ట్రయినీలకు ఈవీఎం లు, పోస్టల్ బ్యాలట్ లెక్కింపు పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణలో ప్రతి చిన్న విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మాన్యువల్ లో సూచించిన ప్రకారం ఓటు చెల్లుబాటును గుర్తించ వలసి వుంటుందన్నారు. ముందుగా ఈవీయం ను పరిశీలించి పోలయిన ఓట్లను సరిచూడాలన్నారు. తరువాత సాంకేతిక పరమైన అంశాలను సరిచూసి ఆపై లెక్కింపుకు వెళ్లాలన్నారు. ఎటువంటి తడబాటుకు అవకాశమీయ రాదన్నారు. పోస్టల్ బ్యాలట్ లెక్కింపు, ఈవీఎం ల లెక్కింపు పైన కూడా అందరికీ పూర్తి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షకులు చెప్పిన విషయాలను క్షుణ్ణంగా ఆకలింపు చేసుకోవాలన్నారు. చిన్న పొరపాటుకు కూడా అవకాశమియ్య రాదన్నారు. నియమ నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. ప్రశాంత చిత్తంతో వున్నట్లయితే ఎటువంటి పొరపాటు జరుగదని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, సిపిఓ జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి. జయరామ్, సివిల్ సప్లైస్ డి.యం. పి.జయంతి, డిల్.ఎల్.డి.ఓ. నాగలక్ష్మి, డి.ఎల్.పి.వో. కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ డి.రామమూర్తి, డిటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ పై నుండి కింద పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** మేడ పై సున్నం వేస్తూ కింద పడి కెజిహెచ్ లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన వైనమిది. భీమిలి సి ఐ రమేష్ గురువారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలి జోన్ 2 వ డివిజన్ స్థానిక తగరపువలస పరిధి వలంద పేటకు చెందిన చిల్ల అప్పలరాజు (55) వృత్తి రీత్యా కారు డ్రైవర్. అయితే ఈ నెల 21 వ తేదీన సాయంత్రం ఇంటి మేడ మీదకు వెళ్లి సున్నం వేస్తున్న సమయం లో తాగిన మైకం లో మేడ పై నిండి కింద పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు.విషయం తెలుసుకొన్న బంధువు అయిన ఎర్రా రెడ్డి అప్పలరాజు కుమారుడు చిల్ల శ్రీను( అతను కారు డ్రైవరే) కు సమాచారం అందించాడు. అతను వెంటనే ఇంటికి వచ్చి తన తండ్రిని చికిత్సనిమిత్తం స్థానిక ఎన్ ఆర్ ఐ ఆసుపత్రిలో చేర్పించాడు. అయితే వైద్యుల సలహా మేరకు శ్రీను మెరుగైన చికిత్స కోసం తన తండ్రిని కెజిహెచ్ కు తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ అప్పలరాజు గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుమారుడు చిల్ల శ్రీను ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ ఐ జి హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# విశాఖ సమాచారమ్

శుక్రవారం 24-05-2024


## హింసకు మద్దతు

పురాణకాలంలో రాక్షసులు కొన్ని ప్రాంతాలలో బలమైన పట్టుకలిగి అక్కడి ప్రజలను హింసించేవారు. హింసాత్మక ప్రవృత్తిగల కొందరు మనుష్యులు కూడా వారితో చేరి తమ సరదాలను తీర్చుకునేందుకు ఇతరులను హింసిస్తూ ఉండేవారు. వీరి వెనుకగల రాక్షసుడిని చూసి, అతడికి భయపడి ప్రజలు ఏమీ చేసేవారు కాదు. అలాగే ఆయా ప్రాంతాలలో ఉన్న రాజులు కూడా అల్పులైన ఇటువంటి హింసాత్మక వ్యక్తులను ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయేవారు. రాక్షసుడి బారిన పడినవారికంటే ఇలాంటి హింసాత్మక ప్రవృత్తి గల అతడి నీడనగల వ్యక్తుల కారణంగా ప్రజలు అనేకబాధలు పడేవారు.

ఇప్పుడు మన రాష్ట్రంలో అదేస్థితి కొనసాగుతోంది. కొందరు ప్రజాప్రతినిధులు తమ హింసాత్మక ప్రవృత్తితో ప్రజలపట్ల రాక్షసులుగా ప్రవర్తిస్తున్నారు. ఇటువంటి హింసాత్మక ధోరణులకు ఆకర్షితులై హింస ద్వారా ఆనందం, సౌకర్యం, ధనం పొందాలని ఆశపడే అల్పులు రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ అకృత్యాలు కొనసాగిస్తున్నారు. ప్రాంతీయ భేదం లేకుండా ప్రజాప్రతినిధుల అండ చూసుకొని పేట్రేగిపోవడం, పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేస్తే వారు కూడా ప్రజాప్రతినిధుల పట్ల గల భయంతో బాధితులపైనే తిరిగి కేసులు నమోదు చేయడం, దౌర్జన్యకారులకు అమితంగా గౌరవమర్యాదలు అందించడం, వారికి సేవలు చేయడం జరుగుతోంది. ఈ వినోదం తాలూకు రుచి చాలామందిలో వివిధ రకాల ఆశలు పుట్టిస్తున్న కారణంగా దౌర్జన్యకారుల సంఖ్య వేలల్లో ఉంది.

ఇతరుల భూములను, దుకాణాలను, వ్యాపారాలను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడం, అప్పులు తీసుకొని ఎగవేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, నిబంధనలు అతిక్రమించడం, అకారణంగా ప్రజలను కొట్టడం, నిర్బంధించడం, బెదిరించడం చాలా మామూలు విషయంగా జరిగిపోతోంది. రాష్ట్ర ప్రజలు పోలీసులపై దాదాపుగా నమ్మకం కోల్పోయారు.

రెవెన్యూ విభాగంలో కూడా ఇదేతంతు కొనసాగుతోంది. డిఫారం, బిఫారం పట్టాలు గల భూములు అనుభవిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా ఉంది. దౌర్జన్యకారులు రాష్ట్రంలోని ఇటువంటి భూములను దాదాపుగా మొత్తం ఆక్రమించారు. రెవెన్యూ అధికారులు ఆయా భూములను చట్టపరంగా వీరిపరం చేసేశారు. దౌర్జన్యకారులకు కొన్ని లక్షల ఎకరాలపై సంపూర్ణ హక్కులు లభించాయి. కోర్టుకు వెళ్లినా ఫలితం లేని విధంగా రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధుల అనుచర గణానికి ప్రయోజనం చేకూర్చిపెట్టారు. ఇలాంటి వ్యవహారాలలో అధికారులు కూడా స్వలాభాన్ని చూసుకుంటున్నారు. లెక్కలు తేడా రావడంతో రెవెన్యూ అధికారులను హత్యచేసిన సంఘటనలు కూడా గమనిస్తున్నాం. ఇక్కడితో ప్రపంచం ఆగిపోతుందని, ఇకపై తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా ప్రజాప్రతినిధులలోను, వారి అనుచరుల లోను, ప్రభుత్వ అధికారులలోను, పోలీసుల లోను వ్యక్తమవుతోంది. తాజాగా మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ పగలుగొట్టిన వీడియో చాలామంది ఉద్యోగుల, అధికారుల మెడకు చుట్టుకుంది. ఎన్నికల అధికారులు సవ్యంగా స్పందించలేదనే ఫిర్యాదు ఉన్నతస్థాయి ఎన్నికల సంఘం అధికారులకు కూడా ఇబ్బందికలిగించేలా ఉంది.

-సూరంపూడివీరభద్రరావు


దక్షిణ మధ్య రైల్వే

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in వందు కూడా చూడవచ్చును.

బహిరంగ ఈ-టెండరు నోటీసు నెం. డిఆర్‌ఎం/పనులు/బిజెడ్‌ఏ/15/2024 తేది. 22.05.2024

PUB/0484

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పనులకు ఎదురుగా సూచించబడిన తేదీలలో గం. 15.00 వరకు ఈ-టెండర్లు ఆహ్వానించుచున్నారు.

1. టెండరు నెం. : ఈ-జోన్-01-ఆర్‌వైపి-2024 పని పేరు : వార్షిక జోనల్ కాంట్రాక్టు-దక్షిణ మధ్య రైల్వే యొక్క రాయనపాడు స్క్రాప్ డిపో వద్ద మరియు వేగన్ వర్క్‌షాప్ యందు అన్ని షాపులు, సర్వీస్ భవనములు, రోడ్లు, వాటరింగ్ ఎరేంజ్‌మెంట్లు యొక్క నిర్వహణ వార్షిక కాంట్రాక్టు. 01-07-2024 నుండి 30-06-2025. పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు) నెలలు టెండరు విలువ: (రూ) 12175807/- ధరావత్తు: (రూ) 200300/- మూసివేయు తేది : 04/06/2024

2. టెండరు నెం. : ఈ-జోన్-02-ఆర్‌వైపి-2024 పని పేరు : దక్షిణ మధ్య రైల్వే యొక్క రాయనపాడు, వేగన్ వర్క్‌షాప్ కోలనీలలో టైప్ I, టైప్ II, టైప్ III, టైప్ IV మరియు సర్వీస్ భవనములు, రోడ్లు, వాటరింగ్ ఏర్పాట్లు యొక్క వార్షిక జోనల్ నిర్వహణ కాంట్రాక్టు. 01-07-2024 నుండి 30-06-2025 కాలమునకు. పూర్తి చేయు కాలం : 12 (పన్నెండు) నెలలు టెండరు విలువ: (రూ) 8160000/- ధరావత్తు: (రూ) 163200/- మూసివేయు తేది : 05/06/2024

3. టెండరు నెం. : ఈ-21-ఈస్ట్-బిజెడ్‌ఏ-2024 పని పేరు : బిజెడ్‌ఏ డివిజన్ : డిఇఎన్/ఈస్ట్/బిజెడ్‌ఏ పరిధిలో ఎడిఇఎన్/లైన్/బిజెడ్‌ఏ & ఎడిఇఎన్/బివిఆర్‌ఎం సబ్ డివిజన్ల యందు సిఎంఎస్ క్రాసింగ్స్ మరియు టౌంగ్‌రైల్స్ రెండు సంవత్సరముల పాటు రీ కండీషనింగ్ చేయుట. పూర్తి చేయు కాలం : 24 (ఇరవై నాలుగు) నెలలు టెండరు విలువ: (రూ) 6909579/- ధరావత్తు: (రూ) 228000/- మూసివేయు తేది : 07/06/2024

4. టెండరు నెం. : ఈ-16-సౌత్-2024 పని పేరు : సీనియర్ డిఇఎన్/బ్రిడ్జెస్/బిజెడ్‌ఏ క్రింద నెల్లూరు స్టేషన్ వద్ద గల యార్డు నందు ప్రతిపాదిత కప్పుతో సహా స్టోరేజ్ షెడ్లు ప్రతిపాదిత నిర్మాణం. పూర్తి చేయు కాలం : 09 (తొమ్మిది) నెలలు టెండరు విలువ: (రూ) 13753871/- ధరావత్తు: (రూ) 218800/- మూసివేయు తేది : 13/06/2024

1) శెక్కుహిక టెండరుదారులు పై టెండరు మూసివేయు తేదీకి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడినవేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ "www.ireps.gov.in" సందర్శించవలసిందిగా సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ పనులు, విజయవాడ

A0617

టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.


## పెతకంశెట్టి అప్పలనరసింహం కు ఘన నివాళి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): మునగపాక మండలంలోని నాగులాపల్లి గ్రామంలో మాజీ ఎంపి పెతకంశెట్టి అప్పలనరసింహం వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. నాగులాపల్లి పంచాయతీ, కార్యాలయం వద్ద పెతకంశెట్టి అప్పలనరసింహం విగ్రహానికి బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర ఇన్చార్జి మల్ల సురేంద్ర స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి విశాఖ ఉమ్మడి జిల్లాలలో ఎన్టీఆర్ వెంట నడిచిన వ్యక్తి అప్పలనరసింహం అని, సమితి అధ్యక్షులుగా, వుడా చైర్మన్ గా, పార్లమెంట్ సభ్యులుగా, ప్రజలకు ఎన్నో సేవలందించారన్నారు. క్రమశిక్షణ కలిగిన అప్పల నరసింహం జయంతి, వర్ధంతులను నేటికీ నిర్వహిస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం ఆయన పట్ల ప్రజలకున్న ఆదరాభిమానాలకు నిదర్శనమన్నారు.

**అప్పలనరసింహం కుమారుడు పెతకంశెట్టి గణబాబు:** పశ్చిమ ఎమ్మెల్యేగా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకొని, తండ్రికి తగ్గ తనయుడిగా, అప్పల నరసింహం ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారు అన్నారు. నేటి తరానికి అప్పల నరసింహం ఆదర్శనీయుడని కొనియాడారు. టీడీపీ సీనియర్ నాయకుడు పెతకంశెట్టి రాజునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మళ్ల ఉమామహేశ్వరరావు, యల్లపు వెంకట భాస్కరరావు, వేగి సోమేశ్వరరావు దాడి మునినాయుడు, పాలమరశెట్టి వాగు, దొడ్డి శివ, పాలమరశెట్టి నూకాలయ్య. మొల్లేటి సత్యనారాయణ, గుల్లేపల్లి సత్తిబాబు, శరగడం సత్యనారాయణ, మోడా రమేష్, భీశెట్టి కోటి, గోవాడ వెంకట అప్పారావు, గోసా గోవింద, మన్మథరావు, బొడ్డేడ అచ్చియ్యనాయుడు కాళ్ల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): పట్టణంలో 10వ తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మీనాక్షి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నాడు ఆమె మాట్లాడుతూ పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12: 45 నిమిషాల వరకు జరుగుతాయన్నారు.ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8:45 నిమిషాలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.ఈ సప్లమెంటరీ పరీక్షలు నేడు ప్రారంభమై జూన్ మూడవ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి తమ పిల్లలను సకాలంలో ఆయా పరీక్షా కేంద్రాలకు పంపించాలని తెలిపారు. విద్యార్థులు అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణుల వ్వాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## ఐశ్వర్య వేంకటేశ్వరుని ఆలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి జోన్ కీటిన్ పేట లో గల ఐశ్వర్య వెంకటేశ్వరుని ఆలయం లో గురువారం స్వామి వారి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం అత్యంత వైభవం గా నిర్వహించబడినది. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు,అర్చనలు అభిషేఖాలునిర్వహించబడ్డాయి. వీటిలో పాల్గొన్న భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించికొని తరించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమం లో ఆలయ ప్రధానార్చకులు పురాణం శేషాచార్యులు, అర్చకులు మనోజ్, విష్ణు, ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి, సూర్యనారాయణ మూర్తి,, భానోజీ రావు, శ్రీనివాసరావు, కోశాధికారి వి బంగార్రాజు ఆర్ ఆర్ ఇంజనీరింగ్ ఎండి శ్రీనివాసరావు, విటా మైనింగ్ ఎండి విజయ భాస్కర్, చందు భాయ్, కలిగొట్ల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో వైశాఖ పౌర్ణమి వేడుకలు



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): స్థానిక కృష్ణా కోలనీ సాగర తిరుమల క్షేత్రం పై కొలువై ఉన్న పద్మావతి గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయం లో గురువారం వైశాఖ పూర్ణమి వేడుకలు నిర్వహించబడ్డాయి. ఆలయ సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో భాగం గా అర్చకులు స్వామి వారికి పంచామృతభిషేఖములు సుగంధ ద్రవ్యాల తో కూడిన జలాలతో, పాలు, పెరుగు లతో అభిషేఖము లు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పూజలు, అర్చనలు నిర్వహించి పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమం లో సంఘము అధ్యక్షులు గాడు అప్పల నాయుడు, ప్రతినిధులు కంటుభుక్త ముత్యాలరావు, ముమ్మిడి శెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగింపు



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): భీమిలి జోన్ స్థానిక గంట స్థంభం వద్ద గల లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్ లో గల అక్రమణలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. మార్కెట్ లో రేకుల షెడ్ లు వేసుకొనిపలువురు వ్యాపారాలు సాగిస్తున్న విషయం తెలుసుకొన్న అధికారులు వాటిని తొలగించి ఆక్రమాణాలను నిరోధించారు. ఈ సందర్భం గా భీమిలి జోన ల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ శిధిలా వస్థలో ఉన్న జీవీఎంసీ లాల్ బహదూర్ శాస్త్రి మార్కెట్ ను తొలగించి దాని స్థానం లో సుమారు 2 కోట్ల రూపాయిల వ్యయం తో వాణిజ్య సముదాయ నిర్మాణం కు చర్యలు చేపట్టామని, అయితే తొలగించిన స్థలం లో కొందరు రేకుల షెడ్ లు వ్యాపారాలు కొనసాగిస్తున్నారని దీనివల్ల కొత్త నిర్మాణానికి అడ్డంకి కి ఉన్న దృష్ట్యా అక్రమణలను తొలగించామని ఆమె స్పష్టం చేశారు. ఆక్రమణ ల తొలగింపు కార్యక్రమం లో భీమిలి జోన్ సహాయపట్టణ ప్రణాళిక అధికారి( ఏసీపీ) డి శ్రీనివాసరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "బొజ్జన్న కొండ "వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చ రల్ అసోసియేషన్ అధ్యక్షులుబల్లా నాగభూష ణము ఆధ్వర్యంలో ఎం.పి..డాక్టర్ బి.వి.సత్యవతి కార్యాలయంలో భగవాన్ బుద్ధుని జయంతి (బుద్ధ పూర్ణిమ) వేడుకలను గురువారం ఘనముగా నిర్వహించారు. ముందుగా ముఖ్య అతిథి ఎం.పి.డాక్టర్ . సత్యవతి బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి బౌద్ధ పూజలు చేసారు.అనంతరం సిద్దార్థ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ తరగతి నుండి ఇంటర్ వరకు గల విద్యార్థుల,కు " బొజ్జన్న కొండ చరిత్ర.... విశిష్టత " అన్న అంశం పై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు ప్రశంసా పత్రాలు..బుద్ధుని మెడల్స్ గిఫ్ట్ లను బహుమతులుగ అందజేసి వారిని అభినందించారు.ఈ సందర్భంగ ఎం.పి... సత్యవతి మాట్లాడుతూ భగవాన్ బుద్ధుడు ప్రపంచానికి మొట్టమొదటిగా అహింస..శాంతి..ధర్మ మార్గాలను ప్రభో దించిన గొప్ప మహనీయుడని అటువంటి మహనీయుని జయంతిని ఈ నాడు ప్రపంచ వ్యాప్తంగా బుద్ధ పూర్ణిమ పర్వ దినముగ ఆరాధించి పూజలు చేసుకొనడం గొప్ప విషయం అని అన్నారు..అలాగే బుద్ధునిశాంతి మార్గమే...ప్రపంచ శాంతికి మార్గ దర్శకమని అన్నారు.అలాగే మన ప్రాంతంలో గల ప్రముఖ బౌద్ధ పర్యాటక క్షేత్రం అభివృద్ధి పనులు అతి త్వరలో పూర్తి అయ్యిఅనకాపల్లి కేంద్రముగా ఈ బొజ్జన్న కొండ అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా ప్రసిద్దిని గాంచి విరాజిల్లు తుందనీ అన్నారు.

గౌరవ అతిథి డాక్టర్ కె.విష్ణుమూర్తి మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు తన జీవితం సర్వస్వం పరుల మేలుకొరకు త్యజించిన గొప్ప సంఘ సంస్కర్త, గొప్ప దార్శ నికుడని ప్రతీ ఒక్కరూ బుద్ధుని అహింసా మార్గం లో నడుచు కొని ప్రపంచ శాంతికి దోహద పదాలని అన్నారు.ఈ కార్యక్రమము లో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చ రల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం,కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా,ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణ మోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వర రావు,కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు,కాపారపు సత్యనారాయణ తెలుగు ప్రొఫెసర్ అల్లాడ సౌజన్య కుమారి, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పోటీలలో 43 మంది పాల్గొనగా 16 మందిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులను అంద చేశారు.

## నృత్య పోటీల్లో చిట్టివలస చిన్నారి జస్మితకు ప్రథమ బహుమతి




భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): శ్రీకాకుళం బాపూజీ కళా మందిరం లో నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీల్లో స్థానిక చిట్టివలసకు చెందిన చిన్నారి జస్మితకు ప్రథమ బహుమతి కైవసం చేసుకొంది. సమ్మర్ ధమాఖ కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో అనేక మంది పాల్గొన్నారు. అలాగే తగరపువలస( చిట్టివలస) నుండి నటరాజ నృత్య నిలయం కు చెందిన చిన్నారులు కూడా పాల్గొన్నారు

పోటీల్లో ప్రథమ బహుమతి జస్మితకు రాగా, ప్రత్యేక బహుమతులను పెంట వెంకట సాయి హరిణి, భవిష్య, కీర్తిలకు నిర్వాహకులు అందజేసారు. కాగా సాయి హరిణి తండ్రి పెంట వెంకట రమణ శర్మ బ్రాహ్మణ సంఘము తగరపువలస శాఖా కోశాధికారిగాను, అర్చక సమాఖ్య రాష్ట్ర శాఖా విశాఖ ఇంచార్జిగాను వ్యవహరిస్తున్నారు. నృత్య పోటీల్లో చిట్టివలసకు చెందిన చిన్నారులు ఉత్తమ ప్రతిభ చూపి బహుమతులను కైవసం చేసుకోవడం పై బ్రాహ్మణ సంఘము ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి నుండి 10 వ తరగతి అనుబంధ పరీక్షలు

భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): శుక్రవారం నుండి జూన్ 3 వరకు 10 వ తరగతి అనుబంధ(నప్లిమెంటరీ) పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 24 న ప్రథమ భాష( తెలుగు),25 న ద్వితీయ భాష ( హిందీ),27 న తృతీయ భాష (ఆంగ్లం),28 న గణితం,29 న రసాయినిక శాస్త్రం( పిఎస్),30 న జీవశాస్త్రం( ఎన్ఎస్),31 న సాంఘీక శాస్త్రం, జూన్ 1న ఓఎస్ఎస్ సి పేపర్-1, జూన్ 4 న ఓఎస్ఎస్ సి పేపర్ -2 పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు నిర్వహించనున్నారు.

**భీమిలిలో 2పరీక్ష కేంద్రాలు :** భీమిలి మండలం లో రెండు పరీక్ష కేంద్రాలు అయిన 1)స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల,2) చిట్టివలస జిల్లా పరిషత బాలుర ఉన్నత పాఠశాల ద్వారా మొత్తం240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని మండల విద్యాశాఖాధికారిణి ఎం శివరాణి గురువారం తెలిపారు. అనుబంధ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు ఉదయం 9 గంటల లోగా హాజరు కావాలని ఎంఈఓ శివరాణి విద్యార్థులను కోరారు.



ఎం ఈ ఓ శివరాణి భీమిలి మండలం

# కేశాలకు బాదాం ఆయిల్



పొడవాటి, మెరిసే మరియు ఒత్తైన జుట్టును పొందడానికి పురాతన పద్ధతి నూనెను ఉపయోగించడం. మీ తలకు నూనెతో మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ పెరుగుతుంది. ఇది జుట్టు పెరుగుదలను మరింత పెంచుతుంది. దాంతో జుట్టు మూలాలకు పోషణ అందుతుంది. అయితే మసాజ్ ఒక్కటే ముఖ్యం కాదు. సరైన నూనెను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యం. హెయిర్ ఆయిల్స్ లిస్ట్ చాలా పెద్దదే ఉన్నప్పటికీ, బాదం నూనె జుట్టు రాలడాన్ని తగ్గించడంలో అత్యంత ప్రభావవంతమైనదిగా నిరూపించబడింది.

జుట్టు రాలడాన్ని నియంత్రించడంలో బాదం నూనె ఎందుకు ప్రభావవంతంగా ఉంటుంది?

**తలలో దురదను పోగొడుతుంది**

స్కాల్ప్ (తల)పై మృతకణాలు పేరుకుపోవడం వల్ల అనేక జుట్టు సమస్యలు వస్తాయని అందరికీ తెలిసిన విషయమే. దీని కారణంగా మీరు జుట్టు రాలడం, దురద మరియు చుండ్రు వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఫుట్‌వర్క్ ఈ సమస్యలను అధిగమించడంలో మీకు సహాయపడుతుంది. తలకు పోషణ మరియు హైడ్రేట్ చేయడానికి బాదం నూనెను ఉపయోగించి చూడండి.

**జుట్టు తిరిగి పెరగడానికి సహాయపడుతుంది**

బాదం నూనెలో బయోటిన్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి మీ జుట్టుకు బాదాం ఆయిల్‌తో మసాజ్ చేయడం వల్ల మీ స్కాల్ప్‌కి రక్త ప్రసరణ పెరుగుతుంది, మీ జుట్టు మూలాలకు పోషణ లభిస్తుంది, జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది మరియు మీ జుట్టు మెరిసేలా చేస్తుంది. అలాగే, ఇది మీ జుట్టు పెరుగుదలను పెంచుతుంది.

**మసాజ్ చేయడం వల్ల జుట్టు పరిమాణం పెరుగుతుంది**

విటమిన్ ఇ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మరియు ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు బాదం నూనెలో లభించే కొన్ని ముఖ్యమైన పోషకాలు. అవి ఆరోగ్యకరమైన జుట్టుకు సహాయపడతాయని నిరూపించబడింది. ఇవి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి మరియు జుట్టు పరిమాణాన్ని పెంచుతాయి. బాదం నూనె కూడా యాంటీఆక్సిడెంట్ల యొక్క శక్తివంతమైన మూలం. అంటే జుట్టు అకాల నెరవడం ఆలస్యం చేస్తుంది.

**జుట్టు సమస్యలను తగ్గిస్తుంది**

మీకు జుట్టు రాలే సమస్య ఉందా? చిక్కుబడ్డ జుట్టును మెయింటెయిన్ చేయడం కష్టంగా ఉందా? అవును. అయితే, బాదం నూనె మీ జుట్టును మృదువుగా చేస్తుంది. ఇది జుట్టును సిల్కీగా మార్చడంతోపాటు కండీషనర్‌గా పని చేస్తుంది. కాబట్టి, మీ జుట్టును దువ్వేటప్పుడు మీకు ఎలాంటి సమస్య ఉండదు. అదనంగా, ఇది జుట్టు దెబ్బతినే అవకాశాన్ని కూడా తగ్గిస్తుంది.

**జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది**

బాదం నూనెలో ఉంజుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుందిడే ఒలీక్ మరియు లినోలిక్ యాసిడ్లు మీ జుట్టును బలపరుస్తాయి మరియు మృదువుగా చేస్తాయి. అదనంగా, నూనెలోని విటమిన్ ఇ యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది మరియు స్ప్లిట్ చివరలను నిర్వహించడానికి మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

**బాదం నూనెతో తలకు మసాజ్**

బాదం నూనెను ఉపయోగించే ముందు వేడి చేయండి. మీ తలకు నూనె రాసి సున్నితంగా మసాజ్ చేయండి. జుట్టు పొడవునా నూనె రాయండి. నూనె రాసిన 3-4 గంటల తర్వాత జుట్టును షాంపూతో శుభ్రం చేసుకోవాలి. జుట్టు రాలడాన్ని ఎదుర్కోవడానికి మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి మీ స్కాల్ప్ మరియు హెయిర్ మసాజ్ చేయడం ఒక గొప్ప టెక్నిక్. ఫాస్ట్‌గా రిజల్ట్ పొందడం కోసం, వారానికి రెండుసార్లు తలకు మసాజ్ చేయండి. మీ జుట్టుకు నూనెను పూయడం వల్ల జుట్టు మరియు తలకు పోషణ మాత్రమే కాకుండా జుట్టు ఉత్తమంగా కనిపిస్తుంది. స్కాల్ప్ మసాజ్ మీ జుట్టుకు రక్షిత పొరను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది, ఎండ, కాలుష్యం మరియు చిన్న వయస్సులోనే తెల్లజుట్టు సమస్యల నుండి కాపాడుతుంది.

**బాదం నూనె హెయిర్ మాస్క్**

మెంతి గింజలు మరియు అరటిని మిక్సీలో రుబ్బుకోవాలి. దానికి ఒక టీస్పూన్ తేనె మరియు ఒక టీస్పూన్ బాదం నూనె వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. ఇప్పుడు మీ హెయిర్ మాస్క్ సిద్ధంగా ఉంది. దీన్ని మీ తలపై మరియు జుట్టు పొడవున అప్లై చేయండి. దీన్ని 15-20 నిమిషాలు అలాగే ఉంచి గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. మెంతి గింజలు చుండ్రు మరియు జుట్టు రాలడం వంటి ఇతర జుట్టు పరిస్థితులను నివారిస్తాయి. అదనంగా, ఈ హెయిర్ మాస్క్‌లోని అరటిపండు మీ జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేయడానికి ఒక సీక్రెట్ పదార్థంగా పనిచేస్తుంది.

**బాదం నూనె సీరం**

బాదం నూనె సీరమ్ మీ జుట్టు బరువుగా కనిపించేలా చేస్తుంది. అలోవెరా మరియు లావెండర్ జుట్టు రాలడాన్ని ఆపడానికి బాదం నూనె యొక్క ప్రయోజనాలను మెరుగుపరుస్తాయి. మూడు చుక్కల లావెండర్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్ మరియు ఒక టీస్పూన్ బాదం నూనె కలపండి. ఈ పదార్థాలన్నీ బాగా మిక్స్ చేసి అప్లై చేయాలి. తడిగా ఉన్నప్పుడే మీ జుట్టు పొడవునా సీరమ్‌ను అప్లై చేయండి. లేడీస్, మీరు మెరిసే జుట్టును పొందాలంటే, ఈ అద్భుతం బాదం నూనెను మిస్ చేయకండి.

# మెరిపించే నూనె



అందంగా ఉండాలని ఎవరికి ఉండదు. మగవారికైనా, ఆడువారికైనా అందంగా కనిపించాలని ఉంటుంది. కానీ అందుకు తగ్గట్టు శ్రమ కూడా పడాల్సిందే. మంచి స్కిన్ కేర్ అండ్ బాడీ కేర్ తీసుకుంటే అందం మీ సొంతం అవుతుంది. అయితే కొన్ని పద్ధతులు ఖచ్చితంగా పాటించాలి. కానీ సమయం ఉండదు. మీ సమయానికి తగ్గట్టు గానే ప్లాన్ చేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మనం పురాతన కాలం నుంచి ఉపయోగించే కొబ్బరి నూనెలో ఎన్నో అద్భుతమైన గుణాలు ఉన్నాయన్న విషయం తెలిసిందే. ఈ నూనెను సరిగ్గా ఉపయోగిస్తే మంచి రిజల్ట్ ఉంటా యని నిపుణులు కూడా చెబుతున్నారు. కొబ్బరి నూనె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇక నుంచి చర్మానికి, జుట్టుకుని కోకోనెట్ ఆయిల్‌ను రాసుకుని స్నానం చేస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. ఇలా ఈ నూనె రాయడం వల్ల చర్మంతో పాటు జుట్టుకు కూడా మంచి పోషణ అందుతుంది.

**కొబ్బరి నూనెతో అమేజింగ్ బెనిఫిట్స్:** క్రిములు, బ్యాక్టీరియా నశిస్తాయి: స్నానం చేసే ముందు చర్మానికి కొబ్బరి నూనెతో మసాజ్ చేసుకుంటే చర్మం మెరిసిపోతుంది. సాధార ణంగా మన శరీరంపై కొన్ని రకాల క్రిములు, బ్యాక్టీరియా పేరుకుని ఉంటాయి. అందుకే ఖచ్చితంగా మీరు స్నానం చేస్తే ముందు కొబ్బరి నూనె రాసి కాస్త మసాజ్ చేసి స్నానం చేస్తే చర్మంపై ఉన్న క్రిములు పోతాయి.

**ఆరోగ్యంగా చర్మం:** కొబ్బరి నూనెలో ఉన్న ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. సాఫ్ట్‌గా, షైనీగా, మొటిమలను తగ్గించడంలో కోకోనెట్ ఆయిల్ సహాయ పడుతుంది. కొబ్బరి నూనె తో మసాజ్ చేయడం వల్ల ముడత లు తగ్గుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

**పట్టుకుచ్చులా జుట్టు:** కొబ్బరి నూనె రాసుకుని, కాస్త కుదుళ్లకు మసాజ్ ఇచ్చి తల స్నానం చేస్తే జుట్టు పట్టుకుచ్చులా ఉంటుంది. మంచి షైనింగ్ వస్తుంది. జుట్టు కూడా నల్లబ డుతుంది.

**మాయిశ్చరైజింగ్ లా పని చేస్తుంది:** కొంతమంది స్కిన్ ఊరికే పొడిబారు పోతుంది. అలాంటి వారికి కొబ్బరి నూనె మంచి మెడిసిన్ లా పని చేస్తుంది. రోజూ స్నానం చేసే ముందు కొబ్బరి నూనెతో మసాజ్ చేస్తే చర్మానికి మాయిశ్చరైజర్ లా పని చేస్తుంది. అలాగే రాత్రిళ్లు కొస్త కొబ్బరి నూనెను శరీరానికి రాసుకుని పడుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

**మృదువుగా మారతాయి:** స్నానానికి ముందు లేదా ముందు రోజు రాత్రి చర్మానికి, జుట్టుకి కోకోనెట్ ఆయిల్ రాసుకుని మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత గోరు వెచ్చటి నీటితో స్నానం చేయాలి. దీని వల్ల చర్మం, జుట్టు మృదువుగా మారతాయి.

# పళ్ళతో బరువు తగ్గండి



మనకు సంపూర్ణ పోషకాలను అందించడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. కానీ మనం వాటిని పెద్దగా పట్టించుకోం. అందులోనూ సీజనల్‌గా వచ్చే పండ్లను అస్సలు మిస్ చేయకుండా తినాలి. కానీ మనకు నీరసంగా ఉన్నప్పుడు, జ్వరం వచ్చినప్పుడు మాత్రమే అవి గుర్తొస్తాయి. పండ్లలో శరీరానికి మేలు చేసే ఎన్నో రకాల పోషకాలు, విటమిన్స్, ఫోలిక్ యాసిడ్స్, ఫైబర్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి పుష్కలంగా ఉంటాయి. కానీ కొంతమంది అతిగా పండ్లను తినేస్తారు. అలా తిన్నా కూడా అనారోగ్యం పాలవుతారని నిపుణులు చెబుతున్నారు. రోజూ సరైన మోతాదులో ఫ్రూట్స్‌ని తీసుకోవడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు. అందులోనూ ప్రస్తుతం అధిక బరువుతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారు పండ్లను తమ డైట్ లో చేర్చుకుని ఈజీగా బరువు తగ్గొచ్చు. మరి బరువు తగ్గేందుకు పండ్లను ఎలా తీసుకుంటే బెటరో ఇప్పుడు తెలుసుకుందాం.

**పెరుగు, చీజ్ తో పండ్లు:** మీరు బరువు తగ్గాలనుకుంటే ప్రోటీన్ తో కలిపి తీసుకోవాలి. కాటేజ్ చీజ్ పండ్లు, గ్రీక్ పెరుగు, నట్స్ వంటి రిచ్ ఫుడ్స్ తీసుకుంటే ఆకలి కంట్రోల్ లో ఉంటుంది. పెరుగు, నట్స్ వల్ల కొద్దిగా తిన్నా పొట్ట నిండిన భావన కలుగుతుంది. అలాగే కెలరీస్ కూడా ఎక్కువగా అందుతాయి. కాబట్టి వేరేవి తినాలన్న కోరిక ఉండదు.

**ఖాళీ కడుపుతో పండ్లు తినకూడదు:** పండ్లను ఎప్పుడూ ఖాళీ కడుపుతో తినకూడదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి ప్రోటీన్, తృణ ధాన్యాలు, పండ్లు కలిపి తీసుకుంటే బెటర్.

**ఎక్కువగా తినకూడదు:** ఫ్రూట్సే కదా ఏమీ కాదని ఎక్కువగా తినకూడదు. ఎందుకంటే పండ్లలోనే కెలరీస్, చక్కెరలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మీరు బరువు తగ్గాలన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన మోతాదులో తినాలి.

**కేవలం ఫ్రూట్స్ మీదనే ఆధారపడకూడదు:** చాలా మంది చేసే తప్పు ఏంటంటే ఫ్రూట్స్ తింటున్నాం కదా అని బ్రేక్ ఫాస్ట్, లంచ్ పై ఆసక్తి చూపించరు. కానీ ఇది చాలా తప్పు. ఇలా చేస్తే బరువు తగ్గడం సంగతి పక్కన పెడితే అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయి. కొన్ని రకాల పండ్లను మీ భోజనం, మరికొన్ని స్మూతీలలో, సలాడ్స్, నట్స్ ఇలా కలుపుతూ తీసుకుంటూ ఉండాలి.

# బేబీ మసాజ్ ఆయిల్‌ను ఇంట్లోనే తయారు చేసుకోండిలా!



పిల్లల దగ్గరికి వచ్చే సరికి మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు తల్లులు. వారికంటూ సపరేట్ కేర్ తీసుకుంటారు. వారు లేచిన దగ్గర్నుంచి పడుకునే వరకు వారిని ఒక మహారాజు, మహారాణిలా చూస్తారు. పిల్లలతో పోల్చితే వారి స్కిన్, జుట్టు కూడా వేరేగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలకు రాసే మసాజ్ ఆయిల్ గురించి తల్లులు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎందుకంటే కొంతమంది పిల్లలకు కొన్ని రకాల ఆయిల్స్ అస్సలు పడవు. ఎలర్జీస్ వస్తాయి. కాబట్టి ఆయిల్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పిల్లలకు చేసే మసాజ్ ఆయిల్ ను ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోవచ్చు. మరి ఆయిల్ ను ఎలా తయారు చేయాలి? తయారు చేయడానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? ఎన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**బేబీ హోమ్ మసాజ్ ఆయిల్ తయారీకి కావాల్సిన పదార్థాలు:**

**ఆముదం, ఆలీవ్ ఆయిల్, లావెండర్ ఆయిల్**

**తయారీ విధానం:** ముందుగా ఓ గిన్నె లేదా డబ్బాలో ఓ రెండు టేబుల్ స్పూన్ ఆముదం తీసుకోవాలి. దానిలోకి స్వచ్ఛమైన ఒక టేబుల్ స్పూన్ ఆలీవ్ ఆయిల్‌ను కలపాలి. అందులో ఓ రెండు చుక్కల లావెండర్ ఆయిల్ వేయాలి. వీటన్నింటి బాగా కలపండి. అంతే బేబీ మసాజ్ ఆయిల్ రెడీ. దీన్ని స్కిన్ కి, జుట్టుకు కూడా వాడుకోవచ్చు.

**గుర్తు పెట్టుకోవాల్సిన విషయాలు:** ఈ బేబీ ఆయిల్ తయారు చేయడానికి కావాలంటే కొబ్బరి నూనెను కూడా వాడవచ్చు. అయితే అది స్వచ్ఛమైనదై ఉండాలి. కావాలంటే కొబ్బరి నూనెను ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. ఆలీవ్ ఆయిల్, కొబ్బరి నూనె స్వచ్ఛంగా లేకపోతే పిల్లలకు చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.

పిల్లలకు రాసే ఆయిల్‌ను వేడి చేసే పద్ధతి కూడా వేరేలా ఉంటుంది. డైరెక్ట్ గా పొయ్యి మీద పెట్టి వేడి చేయకూడదు. డబుల్ బాయిలింగ్ పద్ధతిలో నూనె వేడి చేసి పిల్లలకు మసాజ్ చేయాలి.

ఇలా వేడి అయిన ఆయిల్ ను ఓ గాజు లేదా స్టీల్ డబ్బాలో పెట్టడం మంచిది. ప్లాస్టిక్ డబ్బా వాడకపోవడమే బెటర్.

# కొబ్బరినీటిని తాగితే బరువు తగ్గడంతో ఈ లాభాలు కూడా..



వాతావరణం వేడిగా ఉంది. దీంతో చాలా మంది నీరు తాగుతుంటారు. నీరు మాత్రమే తాగడం సరిపోదు. నీటితో పాటు లిక్విడ్స్ తీసుకోవచ్చు. ఈ నేపథ్యంలో కొబ్బరినీటిని కూడా తీసుకోవచ్చు. దీంతో శరీరానికి కావాల్సిన మినరల్స్ అందుతాయి. కొబ్బరినీరు స్వచ్ఛమైన డ్రింక్. ఈ హాట్ సమ్మర్‌లో కొబ్బరి నీటిని తీసుకుంటే మనకి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజాలు పుష్కలంగా అందుతాయి. దీంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు కూడా దూరమవుతాయి.

**గర్భిణీలకు..** కొబ్బరి నీరు గర్భిణీలకు మంచిది. వీటిని తాగడం వల్ల గుండెల్లో మంట, మలబద్ధకం, అలసట వంటి సమస్యలు దూరమవుతాయి. దీంతో పాటు, జీర్ణ సమస్యలు కూడా తగ్గుతాయి. కొబ్బరినీటిలో ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. ఇవి ప్రధానంగా పొటాషియానికి మూలం.

**చర్మానికి మేలు..** కొబ్బరినీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికే కాదు. చర్మానికి కూడా మంచిది. మొటిమల సమస్యల్ని తగ్గిస్తుంది. ఈ నీటిని తాగితే స్కిన్ యవ్వనంగా మారుతుంది. మొటిమలతో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు మొటిమలు, మచ్చలపై కొబ్బరినీటిని పూయడం మంచిది.

**ఇమ్యూనిటీ పెరగడం..** ఇమ్యూనిటీ వీక్‌గా ఉన్నవారు కచ్చితంగా కొబ్బరినీటిని తీసుకోవాలి. కొబ్బరినీటిలో రిబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్, ఫోలేట్స్ వంటి పోషకాలు, విటమిన్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులోని యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇన్‌ఫ్లూఎంజా వంటి వైరల్ ఇన్ఫెక్షన్స్‌కి వ్యతిరేకంగా పోరాడుతుంది. సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు కూడా నీరు తాగడం మంచిది.

**బరువు తగ్గేందుకు..** కొబ్బరి నీటిని తాగితే బరువు కూడా తగ్గుతారు. ఇందులో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారు రెగ్యులర్‌గా కొబ్బరినీటిని తాగడం మంచిది. తిన్న తర్వాత ఈ నీటిని తాగితే ఆహారంలోని పోషకాలు అందుతాయి.

# రోజూ ఈ పొడి తింటే హార్ట్ ఎటాక్ రాదు!



ఇప్పుడు ఎక్కడ చూసినా, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ గుండె పోటుకు గురవుతున్నారు. చిన్న వయసులోనే హార్ట్ ఎటాక్‌తో మరణిస్తూండటం అందర్నీ కలిచి వేస్తోంది. మాట్లాడుతూ, నడుస్తూ, పని చేస్తూ ఉంటూనే ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నారు. మంచి, చెడు మాట్లాడే సమయం కూడా ఉండటం లేదు. ఎంత ఫిట్‌గా ఉంటున్నా కూడా ఈ సమస్యలు రోజు రోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. సెలబ్రిటీలు సైతం చిన్న ఏజ్ లోనే గుండె పోటుతో మరణిస్తున్నారు. హార్ట్ ఎటాక్ కి అనేక రకరకాల కారణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

అతిగా తినడం, పొగ త్రాగడం, మద్యం సేవించడం, సరైన నిద్ర లేకపోవడం, రోజూ ఒకే చోట కూర్చొని ఉండం, ఆందోళనకు గురవ్వడం, ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, వ్యాయామం చేయకపోవడం, జంక్ ఫుడ్ తినడం ఇలా ఒక్కటేంటి గుండె పోటుకు చాలా కారణాలు ఉంటున్నాయి. గతంలో 50 ఏళ్లు పైబడిన వారు మాత్రమే హార్ట్ ఎటాక్‌కు గురయ్యేవారు. కానీ ఇప్పుడు 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సువారికి కూడా గుండె పోటులు వస్తున్నాయి. గుండె ఆరోగ్యంపై సరైన శ్రద్ధ చూపించకపోవడం వల్లనే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

అయితే అర్జున చెట్టు బెరడును రోజూ తీసుకుంటే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీంతో జీవితంలో గుండెకు సంబంధించిన సమస్యలు చాలా వరకు రావని వైద్య నిపుణులు అంటున్నారు. ఈ అర్జున చెట్టు బెరడు ఆయుర్వేద షాపుల్లో విరివిగా లభిస్తుంది. లేదా చెట్టు బెరడు అందుబాటులో ఉన్నా వాడుకోవచ్చు. ఈ అర్జున చెట్టు బెరడు లేదా పొడిని ఒక గ్లాస్ పాలలో వేసి బాగా మరిగించాలి. అనంతరం ఈ నీటిని తాగితే హార్ట్ ఎటాక్‌లు వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

అలాగే రాత్రంతా ఈ పొడి లేదా బెరడును నీళ్లలో నానబెట్టి మరుసటి రోజు ఉదయం అయినా తాగవచ్చు. ఈ విధంగా అర్జున చెట్టు బెరడును తీసుకోవడం వల్ల గుండె సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం గుండె సమస్యలే కాదు ఇతర అనారోగ్య సమస్యలను కూడా దరి చేరకుండా చేస్తుంది. బీపీని కంట్రోల్ లో ఉంచుతుంది. అస్తమా, దగ్గు కూడా తగ్గుతాయి. చర్మ సమస్యలు కూడా రావు.

# వేసవిలో గ్రీన్ టీ తాగొచ్చా ?



గ్రీన్ టీ తాగితే నిజంగానే బరువు తగ్గుతారా? గ్రీన్ టీ వేడి చేస్తుందంటారు కదా వేసవికాలంలో కూడా గ్రీన్ టీ తాగొచ్చా ?

ఆరోగ్యం కోసం, బరువు తగ్గేందుకు గ్రీన్ టీ ఎక్కువ ప్రాచుర్యం పొందింది. బ్లాక్ టీ, గ్రీన్ టీలు రెండూ ఒకటే జాతి మొక్కలు నుండి లభిస్తాయి. అయితే బ్లాక్ టీలో కంటే గ్రీన్ టీలో కెఫెయిన్ తక్కువగా ఉంటుంది. గ్రీన్ టీలో దాదాపు ముప్పయి వేల రకాల పాలీఫినాల్స్ అనే రసాయనాలు ఉంటాయి. ఈ పోలీఫినాల్స్ ఆరోగ్యానికి వివిధ రకాలుగా మేలు చేకూరుస్తాయి. కాటెచిన్, ఎపికాటెచిన్, ఎపిగాలో కాటెచిన్ గాలెట్ అనే ఫ్లేవనాయిడ్స్ యాంటీఆక్సిడెంట్స్‌గా పనిచేసి మన రోగనిరోధక వ్యవస్థ మెరుగవడానికి ఉపయోగపడతాయి. గ్రీన్ టీ ఉపయోగాలను పరిపూర్ణంగా పొందాలంటే దానిలో క్యాలరీలను పెంచే తేనె, చక్కెర కలపకుండా తీసుకోవాలి. అన్ని రకాల ఆహర పదార్థాల లానే గ్రీన్ టీ కూడా పరిమితికి మించి తీసుకుంటే మంచిది కాదు. రోజుకు నాలుగు కప్పులకు మించకుండా గ్రీన్ టీ తాగవచ్చు. శారీరక శ్రమ చేస్తూ, వయసుకు తగ్గట్టు సరిపడా ఆహారం తీసుకొంటూ చక్కెర, బెల్లం, తేనె వేసిన టీ, కాఫీ లాంటి పానీయాలకు బదులుగా గ్రీన్ టీ తీసుకొంటే బరువు నియంత్రణలో ఉంటుంది. కానీ జీవనశైలిలో ఏ మార్పులూ లేకుండా కేవలం గ్రీన్ టీని తాగడం వల్ల బరువు తగ్గరు. గ్రీన్ టీ వేసవిలోనూ తీసుకోవచ్చు.

## సంజీవని నిధికి హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగులు రూ.6.45 లక్షల విరాళం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలోని పేదలకు, అనారోగ్య బాధితులకు సాయం చేయాలనే దృక్పథంతో నెలకొల్పిన సంజీవని నిధి - డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్ కు నిధులు ఇచ్చేందుకు స్థానిక హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగులు సహృదయంతో ముందుకొచ్చారు. తమ వంతు సాయంగా ఉద్యోగులంతా కలిసి రూ.6,45,000 విరాళంగా అందించారు. సదరు మొత్తాన్ని సంజీవని నిధి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ మేరకు హెచ్.పి.సి.ఎల్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. రతన్ రాజ్ జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జునను కలిసి సంబంధిత పత్రాలను అందజేశారు. విశాఖ రిఫైనరీలో పని చేస్తున్న ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి పేదల సహాయార్థం నెలకొల్పిన సంజీవని నిధికి తమ వంతుగా ఆర్థిక సాయం అందించారని తెలిపారు. హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగుల చూపిన చొరవను, దాతృత్వాన్ని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. విరాళాలు అందించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హెచ్.పి.సి.ఎల్. ఉద్యోగుల చూపిన చొరవ మిగిలిన అందిరిలో తప్పకుండా స్ఫూర్తిని నింపుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైళ్ల రద్దు/ షార్ట్ టెర్మినేషన్/ రీషెడ్యూలింగ్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పుండి-నౌపడా-కోటబొమ్మాళి సెక్షన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా, నౌపడ యార్డ్ వద్ద మరియు పర్లాకిమిడి యార్డ్ వద్ద 24.05.2024 మరియు 27.05.2024న కొన్ని రైళ్లు రద్దు చేయబడతాయి/ షార్ట్ టర్మినేట్ చేయబడతాయి మరియు కొన్ని రైళ్లు దిగువ వివరించిన విధంగా రీషెడ్యూల్ చేయబడతాయి.

**రద్దు చేయబడిన రైళ్లు:**

1. 24.05.2024 మరియు 27.05.2024 తేదీలలో విశాఖపట్నం నుండి బయలుదేరే రైలు నెం. 08522 విశాఖపట్నం-గుణపూర్ ప్యాసింజర్ రద్దు చేయబడుతుంది

2. 24.05.2024 మరియు 27.05.2024 తేదీలలో గుణుపూర్ నుండి బయలుదేరే రైలు నెం. 08521 గుణుపూర్-విశాఖపట్నం ప్యాసింజర్ రద్దు చేయబడుతుంది.

3.రైలు నెం. 07471 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్ మరియు రైలు నం. 07470 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్ రైళ్లు 27.05.2024న రద్దు చేయబడతాయి.

**రైళ్ల స్వల్ప ముగింపు:**

1.రైలు నెం. 18117 రూర్కెలా - గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రూర్కెలా నుండి 23.05.2024 మరియు 26.05.2024న బయలుదేరి పలాసలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది మరియు పలాస నుండి రూర్కెలాకు 18118 రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌గా 24.05-24 తేదీల్లో తిరిగి వస్తుంది.

2. 27.05.2024న పూరి నుండి బయలుదేరే నెం.18417 పూరి-గుణపూర్ ఎక్స్‌ప్రెస్ పలాసలో షార్ట్ టర్మినేట్ చేయబడుతుంది మరియు 28.05.2024న పలాస నుండి పూరీకి 18418 ఎక్స్‌ప్రెస్‌గా తిరిగి వస్తుంది.

**రైళ్ల రీషెడ్యూల్:**

1. రైలు నం. 18526 విశాఖపట్నం-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ ప్రకారం 15.00 గంటలకు బయలుదేరే బదులు 27.05.2024న 16.00 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరే విధంగా మార్చబడుతుంది.

2.రైలు నెం.07225 సికింద్రాబాద్- షాలిమార్ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ ప్రకారం 04.30 గంటలకు బయలుదేరడానికి బదులుగా 27.05.2024న 05.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది.

3.రైలు నెం.07234 సికింద్రాబాద్-సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 26.05.2024న 23.40 గంటలకు బయలుదేరడానికి బదులుగా 27.05.2024న 02.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరుతుంది.

ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా పనిచేయాలని అభ్యర్థించారు. జరిగిన అసౌకర్యానికి ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు.

## పలు ఆలయాలు సందర్శించిన వాసుపల్లి దంపతులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వైశాఖి పౌర్ణమి సందర్భంగా దక్షిణ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, ఉషరాణి దంపతులు గురువారం ఉదయం పలు ఆలయాలు సందర్శించారు. ముఖ్యంగా పౌర్ణమి రోజున విశిష్టత కలిగిన సత్యనారాయణ స్వామి నీ సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ముమ్మారు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే శ్రీ జగన్నాథ స్వామి వారి దేవాలయంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం లో భాగంగా ఈ రోజు వైశాక పూర్ణిమ రోజున స్వామివారి చక్రవారోత్సవము లో శ్రీ వాసుపల్లి గణేష్ కుమార్ సతీ సమేతంగా పాల్గొని పూజలు చేశారు.

అనంతరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని దంపతలిద్దరూ స్వహస్తాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. గురువారం పౌర్ణమి రోజున ప్రత్యేకంగా 34 వార్డులో శ్రీ సాయిబాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ తాత్కాలికంగా నిలిపివేయాలి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** గిరిజన సంక్షేమ శాఖలో చోటు చేసుకున్న అవినీతి వ్యవహారం ఆ శాఖకు తలనొప్పిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10 ఐటీడీఏల్లో పని చేస్తున్న అర్హులైన సుమారు 483 మంది. కాంట్రాక్టు టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ వ్యవహారంలో భారీగా సాగిన వసూళ్ల వ్యవహారం తీవ్ర వివాదంగా మారింది. గత సంవత్సరం అక్టోబరు 21న ఆర్థిక శాఖ జీవో 114 జారీ చేసింది. దీని ప్రకారం ఈ ఏడాది జూన్ 2లోగా ఆయా ఐటీడీఏల పరిధిలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠ శాలల్లో కాంట్రాక్టు టీచర్లు(సీఆర్)గా చేరిన వారి సర్వీసును క్రమబద్ధీకరించాలి. ఈ మేరకు గిరిజన సంక్షేమ డైరెక్టర్ కార్యాలయం ఈ సంవత్సరం ప్రారం భంలో ఆయా ఐటీడీఏల పరిధిలోని జిల్లా యూనిట్లకు సూచనలు చేసింది. దీంతో ఆయా ఐటీడీఏల పరిధిలోని గిరిజన సంక్షేమ జిల్లా అధికారుల కార్యాలయాలు చర్యలు చేపట్టాయి. శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 46 మంది, విజయనగరం జిల్లా పార్వతీ పురం ఐటీడీఏ పరిధిలో 131 మంది, విశాఖపట్నం జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 209 మంది, తూర్పు గోదావరి జిల్లాలో 92 మంది, పశ్చిమ గోదా వరి జిల్లాలో నలుగురు, కృష్ణా జిల్లాలో ఒకరు, గుంటూరు జిల్లాలో ఐదు గురు, ప్రకాశం జిల్లాలో ఒకరు, నెల్లూరు జిల్లాలో ముగ్గురు, కర్నూలు జిల్లాలో ముగ్గురు మొత్తం 483 మంది కాంట్రాక్టు టీచర్లను అర్హులుగా గుర్తించారు. వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. ఇంత వరకు బాగానే ఉన్నా. అసలు కథ ఇక్కడే మొదలైంది. సర్వీసును క్రమబద్ధీకరించేందుకు ఒక్కొక్క ఉపాధ్యాయుడిని రూ. లక్ష ముడుపులు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్టు తెలిసింది. అది కూడా రాష్ట్ర కార్యాలయం నుంచే అనధికారిక ఆదేశాలు రావడంతో ఉపాధ్యాయులు విస్తుబోయారు. కాదంటే తమ సర్వీసు క్రమబద్ధీకరణ కాదేమోనన్న నన్న బెంగతో అడిగినంతా సమర్పించుకున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.4.50 కోట్ల మేర వసూళ్లు సాగాయని సమాచారం. అంతే కాకుండా ఆయా జిల్లా కార్యాలయాలకు సంబంధించి కూడా ప్రతి టీచర్ నుంచి రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వసూలు చేసినట్టు తెలిసింది. ఈ నియామకాల కోసం కమిటీలను కూడా నియమించి వ్యవహారం మొత్తాన్ని చక్కబెట్టారు. ఈ అవినీతి వ్యవ హారం తాజాగా రచ్చకెక్కడంతో పలు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు విచారణ చేపట్టారు. ఐటీడీఏ పరిధిలో జరిగే ప్రతి అంశమూ ప్రాజెక్టు అధికారి ఆమోదంతోనే జరగాల్సి ఉండగా ఈ విషయానికి సంబంధించి మాత్రం ప్రాజెక్టు అధికారితో సంబంధం లేకుండానే రాష్ట్ర గిరిజన సంక్షేమ డైరెక్టర్ కార్యాలయం చక్కబెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉపాధ్యాయుల ఫైళ్లను నేరుగా డైరెక్టర్ కార్యాలయానికే తెప్పించుకున్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే స్థానిక గిరిజన సంక్షేమ కార్యాలయంలో బాధ్యు లైన ఉన్నతాధికారుల నుంచి సెక్షన్ గుమస్తాల వరకు అందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన చేసిన విచారణలో పలువురు అనర్హులను సిఫారసు చేయడం, ఆయా సీఆర్టీల నియామక నోటిఫికేషన్ను సక్రమంగా పరిశీలించకపోవడం, పలువురికి సరైన బాండ్లు లేకపోవడం, డ్యూటీ సర్టిఫికెట్లకు సంబంధించి విచారణ జరపకపోవడం వంటివి వెలుగు చూశాయి. అంతేకాదు... పలువురికి టెట్ అర్హత కూడా లేకపోవడం వంటి లోపాలను గుర్తించినట్టు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు గిరిజన సంక్షేమ శాఖలో సంచలనంగా మారింది దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు,

దీని పై సమగ్రమైన దర్యాప్తు చెయ్యాలి ఆదివాసీ సంఘ నాయకులు డా,,హేమా నాయక్ డిమాండ్ కోరుతున్నారు. 10 ఐటీడీఏ లు లో జరిగిన లాంచవతారంలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు విచారణ కు ఆదేశాలు ఇవ్వాలని డా హేమానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ప్రభుత్వం అడ్డగోలుగా నియామకాలు ఇచ్చిన ఉద్యోగుల క్రమబద్ధీకరణ ను తాత్కాలిక రద్దు చేసి కొత్తగా క్రమబద్ధీకరణ చేపట్టాలని ఆదివాసీ సంఘ నాయకులు డా,, హేమానాయక్ డిమాండ్ చేశారు.

## బాబుల శ్రీనును పరామర్శించిన వాసుపల్లి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 32వ వార్డు వైసిపి నాయకుడు బాబుల శ్రీను అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న దక్షిణ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ విజేత హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాబుల శ్రీనును పరామర్శించి కుటుంబానికి ధైర్యం కల్పించారు. పెరాలసిస్ రావడంతో చేతిలు, కాళ్లు లేవలేక ఇబ్బంది పడడంతో అధైర్య పడవద్దని డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందిస్తానని ఆ కుటుంబానికి వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. ఆయనతోపాటు వైసీపీ శ్రేణులు 32వ వార్డు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## సింహాచలం పుష్కర్ణి వద్ద రహదారి, భక్తులకు సదుపాయాలు కల్పించాలి

**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** సింహాచలం పుష్కర్ణి వద్ద ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిన సింహాచల దేవస్థానం మరియు జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ వారు. సుమారు నాలుగువేల మంది నివసిస్తున్నటువంటి విజినిగిరి పాలెం, కృష్ణ గార్డెన్స్, చంద్ర గార్డెన్స్, ఎంఎంటీసీ కాలనీ మొదలగు ప్రాంతాల ప్రజలు సింహాచలం పుష్కర్ నీ మీద గానే జీవనం సాగించాలి. అటువంటి ప్రాంతంలో ఉన్న పుష్కర్ణి వద్ద అక్కడికి వచ్చే భక్తులు బహిరంగ మలవిసర్జన చేస్తున్న, అక్కడ విపరీతమైన ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్న పట్టించుకోని సింహాచల దేవస్థానం, జీవీఎంసీ మరియు పోలీస్ శాఖ వారు తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరుతూ- పాశర్ల ప్రసాద్, జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరియు మాజీ సర్పంచ్ అడవివరం.

## సింహాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రానికి గురువారం భక్తులు పోటెత్తారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా అప్పన్న స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వామి వారికి చందన సమర్పణ పూర్తిచేశారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామి వారికి మేల్కొలుపు పలికారు. సుప్రభాత సేవలు నిర్వహించి, సుగంధ ద్రవ్యాలు మిళితం చేసి సిద్ధం చేసిన శ్రీ గంధాన్ని స్వామికి సమర్పణ చేశారు. స్వామి వారి నిజరూప దర్శనం కోసం, వైశాఖ పౌర్ణమి ఉత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వరాహ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు సింహాచలం ఈవో తెలిపారు.

## కోడుమూరు సమీపంలో బోల్తా పడ్డ వోల్వో బస్సు.. ఇద్దరు పిల్లల దుర్మరణం



హైదరాబాద్ నుంచి ఆదోని వెళుతున్న ఓ బస్సు ప్రమాదానికి గురైంది. ప్రైవేట్ ట్రావెల్స్ కు చెందిన ఈ బస్సు కర్నూల్ కోడుమూరు సమీపంలో బోల్తా పడింది. దీంతో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం గమనించిన గ్రామస్థులు వెంటనే స్పందించారు. బస్సులో చిక్కుకున్న వారిని వెలుపలికి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడ్డ ప్రయాణికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. బోల్తా పడ్డ బస్సును క్రేన్ సాయంతో సరిచేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రమాదానికి కారణాన్ని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తమను నమ్మి గెలిపించిన ప్రజలకు త్రాగునీటి సమస్యలు రానివ్వం

### సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ దారలక్ష్మి




**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** తమను నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు నీటి సమస్యలు రానివ్వమని స్థానిక సర్పంచ్ దురియాపుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారలక్ష్మి అన్నారు. తమను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకున్న నాటి నుంచి ప్రతీ ఏటా వేసవి కాలం ప్రారంభం అయిన నాటి నుంచి. గ్రామంలో పంచాయతీ పరంగా సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీగా దారలక్ష్మి తన పరిధి లోని పలు వీధులలో ట్యాంకల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను నమ్మి సర్పంచ్, ఎంపీటీసీ లుగా గెలిపించుకున్న ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నెలకొన్న నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఆలోచన చేస్తున్నప్పటికీ నీటి వనరుల కొరత కారణంగా గ్రామంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లేక పోయినప్పటికీ, తమపై నమ్మకంతో ఓట్లేసి ప్రజా ప్రతినిధులుగా గెలిపించిన ప్రజలు నీటి సమస్యను ఎదుర్కోరాదనే ఏకైక లక్ష్యంతో ప్రతీ ఏటా నీటి సమస్య తాత్కాలిక పరిష్కారానికి ట్యాంక్ ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు కూడా మంచిగా సద్వినియోగం చేసుకుంటున్నారని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సాయుధ తెలంగాణ పోరాట యోధుడు నల్లమల గిరి ప్రసాద్ వర్ధంతి (మే 24)



నల్లమల ప్రసాద రావు (గిరి ప్రసాద్) ఏప్రిల్ 6, 1931 న ఖమ్మం జిల్లా మధిర తాలూకా తొండల గోపవరం గ్రామంలో జన్మించారు. ఇతని తండ్రి పేరు నల్లమల రామయ్య. మద్రాసు కళాశాలలో చదువుతున్న రోజుల్లో ఆంధ్రా మహా సభ సాగిస్తున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారు. 1947 లో ఆంధ్ర మహా సభ కార్యక్రమాలలో పాల్గొంటూ కమ్యూనిస్టు పార్టీ లో చేరారు. కొత్తగూడెం లో బొగ్గు గని కార్మికుల యూనియన్ ను స్థాపించిన నాయకుడైన శేషగిరిరావు ను పోలీసులు కాల్చి చంపిన సందర్భం లో ఆ అమర వీరుని పేరులోని గిరి పదాన్ని స్వీకరించి 'గిరిదళం' అనే పేరుతో సాయుధ పోరాటాన్ని సాగించారు. వీరు అజ్ఞాతవాసం నుంచి బయటకు వచ్చిన తరువాత 'గిరిదళం' అనే దళ నామం లోని గిరిని వీరు పేరు ముందు చేర్చి వీరిని గిరి ప్రసాద రావు అని ప్రజలు ప్రేమతో పిలవ సాగారు. అజ్ఞాత వాసం అనంతరం 1953 లో ప్రభుత్వం వీరిని అరెస్ట్ చేసింది. 1953 లో ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఎన్నికై 1964 లో పార్టీ చీలే వరకు కొనసాగారు. 1962 శాసన సభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా గెలిచారు. 1962 లో చైనా భారత సరిహద్దు సంఘర్షణ సందర్భం లో ప్రభుత్వం దేశ రక్షణ చట్టం కింద వీరికీ సంవత్సర కాలం జైలు శిక్ష విధించారు. 1978 లో కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు ఆ బాధ్యత నిర్వహించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులుగా కూడా పని చేశారు. 1992 నుండి రాజ్యసభ సభ్యులుగా వ్యవహరించారు. 1992 సి పి ఐ జాతీయ సమితి కార్యదర్శి గా, 1996లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. వీరు మే 24, 1997 న మరణించారు.

**డా. జె.వి. ప్రమోద్ కుమార్**
**పైడి మెట్ట 9490833108.**

## శ్రీ క్షేత్రం లో నరసింహస్వామి అవతారంలో శ్రీనివాసుడు



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో శ్రీని వాసునికి నరసింహ స్వామి అవతారంగా కన్నుల పండువగా అలంకరించారు .దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు ,చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు వేదమంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు . వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి చల్లదనం కోసం చందనంతో అలంకరించారు .ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు నీరజ మన్నే భక్తులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన కలెక్టర్



**కర్నూలు:** పట్టణంలోని స్థానిక రాయలసీమ యూనివర్సిటీలో కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్, ఈవీఎం యంత్రాలను భద్రపరచిన లైఫ్ సైన్స్ బ్లాక్, కౌంటింగ్ హాలును జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్, ఎన్నికల అధికారిణి జి.సృజన పరిశీలించారు. అంతకుముందు పరిశీలనకు సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవీఎం యంత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## పరవాడ,సబ్ స్టేషన్ సెంటర్లో ప్రయాణికులకు నీడ ఏర్పాటు చేయండి మహాప్రభు!



పరవాడ, (విశాఖ సమాచారమ్): మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో, సబ్ స్టేషన్ సెంటర్లో బస్సు ప్రయాణికుల కొరకు కొంత నీడ ఏర్పాటు చేయండి మహాప్రభు అంటూ ప్రజలు వేడుకుంటున్నారు. బస్ కొరకు బస్ స్టాప్ లో గంటల కొలది ఎండలో నిలబడ వలసి వస్తుందని బస్ షెల్టర్ లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ రెండు ప్రదేశాల్లో బస్ షెల్టర్ ఉండేవని కొన్ని అనివార్య కారణాలవల్ల వాటిని తొలగించడం జరిగిందని , విద్యార్థులు, ప్రయాణికులు అంటున్నారు. కావున సంబంధించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఫార్మా పరిశ్రమ యజమాని ప్రజల యొక్క ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇచ్చట బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఘనంగా శ్రీ లలితాదేవి ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలు

### భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించిన రత్నాకర్








**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని పార్కు సెంటర్ వద్ద కొలువైన శ్రీ లలితాదేవి ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ గురువారం ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన రత్నాకర్ ని ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామచరణ్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రత్నాకర్ కి తీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాడి మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా అమ్మవారి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. ఇంత వరకు తాత్కాలిక నిర్మాణంలో ఉన్న ఆలయానికి శాశ్వత నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బుద్ధ కుమార్, బుద్ధ సతీష్‌కుమార్, చదరం వెంకటరావు, కర్రి నూకరాజు, బుద్ధ సుబ్బలక్ష్మి, గుప్త వినయ్, బుద్ధ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసుని కళ్యాణం కమనీయం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో రింగ్ రోడ్డులో ఉన్న పెంటకోట కన్వెన్షన్ హాలులో అన్న మాచార్య వాగ్గేయ వరదాయిని నిర్వాహకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, కొణతాల సూరి అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో 175 వ ఇంటింటి గోవిం దుడు శ్రీనివాస కళ్యాణం కార్యక్రమం గురువారం కన్నుల పండుగగా జరిగింది. శ్రీనివాసుని కల్యాణంలో 175 జంటలు పాల్గొన్నాయి. అర్చకులు రమణాచార్యులు గోవిందుని కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ , మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ,పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహ కుల్ని సీఎం రమేష్ అభినందించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి పరవశించారు.

## మంజుమ్మల్ బోయ్స్ నిర్మాతలకు ఇళయరాజా నోటీసులు



మంజుమ్మల్ బోయ్స్ సినిమా నిర్మాతలకు సంగీత దర్శకుడు మాస్ట్రో ఇళయరాజా నోటీసులు అందజేశారు. గుణ (1991) సినిమాలో తాను స్వరపరిచిన ఓ పాటను 'మంజుమ్మల్ బోయ్స్' సినిమాలో అనుమతి లేకుండా వాడుకున్నందుకు గాను ఇళయరాజా ఈ నోటీ సులు ఇచ్చారు. ఈ మేరకు చిత్ర నిర్మాతలు సౌబిన్ షాహిర్, బాబు షాహిర్ , షాన్ ఆంటోనీ ల అడ్రస్ లకు ఇళయారాజా ఈ నోటీసులు పంపించారు.

గుణ సినిమాలోని 'కణ్మని అన్బోదు కాదలన్'పాటపై చట్టపరమైన, నైతికమైన ప్రత్యేక హక్కులు తనకు మాత్రమే ఉన్నాయని ఇళయరాజా ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమా పాటను మంజుమ్మల్ బోయ్స్ సినిమాలో వాడుకోవడం నేరమని ఇళయరాజా తెలిపారు. ఇప్పటికైనా సదరు నిర్మాతలు తన నుంచి అనుమతి తీసుకోవాలని, రాయల్టీ చెల్లించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆ నోటీసులో పేర్కొన్నారు.

## అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ తల్లి పండుగ మహోత్సవం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో శ్రీశ్రీశ్రీ బ్రాహ్మిని ముత్యాలమ్మ తల్లి పండుగ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము 5 గంటల నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని , పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి , సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు అమ్మవారి దర్శనం చేసుకొని ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్న సమారాధన ప్రారంభించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు 2000 మంది భక్తులు ఈ అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పైలా రామచంద్రరావు, చీపురుపల్లి సన్యాసిరావు, రెడ్డి శ్రీను, పైలా సన్యాసినాయుడు, పైలా అక్కునాయుడు, పైల అప్పలనాయుడు, జగదీష్,, గండి ఈశ్వరరావు, బండారు రవి, పైలా కృష్ణ, పైలా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్బికేలలో అందుబాటులో ఉన్న 100 క్వింటాళ్ల విత్తనాలు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రములో పచ్చి రొట్ట విత్తనములు 100 క్వింటాళ్ల మొత్తంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పాలిమేర మోహనరావు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం నాడు ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు వరి సాగు 4000 ఎకరాలు ఉండచ్చని ఈ సంవత్సరం మంచి వర్షాలు కూడా ఉంటాయన్నారు.రైతులంతా 50శాతం రాయితీ మీద విత్తనములు వినియోగించుకోవాలని,రైతులు తమ ఆర్బికేలలో వారి వివరాలు నమోదు చేసి భూమి పాసు పుస్తకం, ఆధార్ నంబర్ తెచ్చుకొని వినియోగించు కోవాలన్నారు.అలాగే వరి విత్తనములు కూడా అందరికీ అందుబాటులో ఉంటాయని ఆర్ జి ఎల్ 2537తో పాటుగా కొత్త రకాలైన ఎమ్ టి యు 1318,ఎమ్ టి యు-1061,1064,1224,7026 విత్తనాలు సబ్సిడీ మీద ఆర్బికేలలో అందుబాటులో ఉన్నాయని, అలాగే కొర్ర,సామ గంటి విత్తనములు కె వి కె కొండెంపుడి వద్ద అందుబాటులో ఉన్నయని తెలిపారు.ఈ పచ్చరొట్ట విత్తనాలు వలన భూమి సారవంతంగా ఉండి ఎక్కువ దిగుబడి రావడానికి అవకాశం ఉంటుందని,ఎరువులు వేసే అవసరం తగ్గుతుందని ముఖ్యంగా యూరియా ఎరువు,పురుగుల తెగుళ్ల ఉధృతి ఉండదని తెలియజేశారు.

## డ్రైవింగ్ లైసెన్స్ కొత్త రూల్స్



ఇకపై డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ కోసం ఆర్టీవో కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. పెద్ద మొత్తంలో డాక్యుమెంట్లు సమర్పించక్కర్లేదు. ఈ మేరకు జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ ఇటీవల మార్గదర్శకాలు జారీ చేసింది. డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందే విధానాన్ని మరింత సులభతరం చేస్తూ వీటిని తీసుకొచ్చింది.

**కీలక మార్పులు:**

ఇకపై డ్రైవింగ్ టెస్ట్ కోసం ప్రాంతీయ రవాణా కార్యాలయాలకువెళ్లాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ డ్రైవింగ్ స్కూళ్లలోనే ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడు టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే స్కూళ్లు వారికి ఒక ధ్రువపత్రాన్ని జారీ చేస్తాయి. వాటితో ఆర్‌టీవో కార్యాలయంలో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. డ్రైవింగ్ టెస్ట్‌ను నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ కేంద్రం ప్రైవేట్ సంస్థలకు సర్టిఫికెట్లు జారీ చేస్తోంది. అవి లేని స్కూళ్లలో డ్రైవింగ్ నేర్చుకుంటే మాత్రం కచ్చితంగా ఆర్‌టీవోల్లో టెస్ట్‌కు హాజరుకావాల్సిందే.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే గరిష్ఠంగా రూ.2,000 వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మైనర్లు డ్రైవ్ చేస్తున్నట్లు గుర్తిస్తే దాదాపు రూ.25,000 వరకు పెనాల్టీ కట్టాలి. పైగా ఆ వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేస్తారు. 25 ఏళ్ల వయసు వచ్చే వరకు ఆ మైనర్ లైసెన్స్‌కు అనర్హుడవుతాడు.

లైసెన్స్ దరఖాస్తు కోసం కావాల్సిన పత్రాల సంఖ్యను కుదించారు. ఇవి వాహనాన్ని బట్టి (ద్విచక్ర, త్రిచక్ర, భారీ వాహనాలు..) వేర్వేరుగా ఉంటాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని మాత్రం కేంద్రం మార్చలేదు.

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించటంలో భాగంగా పెద్ద మొత్తంలో ప్రభుత్వ వాహనాలను తొలగించాలని నిర్ణయించింది. ఇతర వెహికల్స్‌కు ఉద్గార ప్రమాణాలను పెంచారు. పరోక్షంగా విద్యుత్తు వాహన వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించినట్లైంది.

**కొత్త నిబంధనల ప్రకారం వివిధ రకాల ఫీజులు..**

లెర్నర్స్ లైసెన్స్ - రూ.200
లెర్నర్స్ లైసెన్స్ రెన్యువల్ - రూ.200
ఇంటర్నేషనల్ లైసెన్స్ - రూ.1,000
శాశ్వత లైసెన్స్ - రూ.200
శాశ్వత లైసెన్స్ రెన్యువల్ - రూ.200
రెన్యువల్ చేసిన డ్రైవర్ లైసెన్స్ జారీ - రూ.200
లైసెన్స్ వివరాల్లో మార్పులు - రూ.200

**ప్రైవేట్ డ్రైవింగ్ స్కూళ్లకు మార్గదర్శకాలు..**

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలకు కనీసం ఒక ఎకరం స్థలం ఉండాలి. పెద్ద వాహనాల శిక్షణకైతే రెండు ఎకరాలు.

స్కూళ్లలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహణకు సంబంధించిన వసతులు తప్పనిసరి.

శిక్షణనిచ్చేవాళ్లకు కనీసం హైస్కూల్ డిప్లొమా (సమానమైన అర్హత) ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం ఐదేళ్ల అనుభవం తప్పనిసరి. బయోమెట్రిక్స్ సహా ఐటీ సిస్టమ్స్‌పై అవగాహన అవసరం.

లైట్ మోటార్ వాహనాలకు గరిష్ఠంగా నాలుగువారాల్లో 29 గంటల శిక్షణనివ్వాలి. 21 గంటలు ప్రాక్టికల్, 9 గంటలు థియరీ సెషన్‌గా విభజించారు. మీడియం, హెవీ వెహికల్స్‌కు అయితే ఆరు వారాల్లో కనీసం 38 (31 - 8) గంటల శిక్షణ అందించాలి.

ట్రైనింగ్ ఇవ్వకుండా లైసెన్స్ జారీ లేదా రెన్యువల్ చేస్తే డ్రైవింగ్ స్కూళ్లు రూ.5,000 ఫైన్ కట్టాల్సి ఉంటుంది.

## నేడు జాతీయ సోదరుల దినోత్సవం



సోదరులు నిజంగా ఒక ఆశీర్వాదం. వారు నేరంలో మా భాగస్వామి, అతిపెద్ద మద్దతు మరియు ఎవ్వరూ చేయలేని మార్గాల్లో మమ్మల్ని అర్థం చేసుకుంటారు. సంక్షోభం మరియు ఒంటరితనం సమయంలో ఒక పెద్ద లేదా తమ్ముడు యొక్క ఉనికి కొన్నిసార్లు అతిపెద్ద ఉపశమనంగా ఉంటుంది. మీరు రోజులు, నెలలు లేదా సంవత్సరాలు కనెక్ట్ కాకపోవచ్చు, కానీ మీరు కనెక్ట్ చేసినప్పుడు, అది మళ్లీ పాత కాలం అవుతుంది. మీకు 8 ఏళ్లు లేదా 80 ఏళ్లు ఉన్నా, మీ సోదరుడి దగ్గర ఉండటం వల్ల మీ బాధలన్నీ కాసేపు మర్చిపోవచ్చు. మీరు మీ సోదరుడితో కలిసి లేకపోయినా, మీరు వారితో జీవితకాల జ్ఞాపకాలను కలిగి ఉన్నందున మీరు వారిని నిజంగా ద్వేషించలేరు.

జాతీయ సోదరుల దినోత్సవాన్ని 2005 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం మే 24న జరుపుకుంటారు మరియు ఆ రోజు యొక్క ప్రాముఖ్యత మరియు చరిత్ర గురించి చాలా తక్కువ వివరాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అలబామాకు చెందిన సి. డేనియల్ రోడ్స్ సోదరులను జరుపుకోవడానికి ఈ సెలవుదినాన్ని సృష్టించిన ఘనత పొందారు.

**జాతీయ సోదరుల దినోత్సవం రోజున ఏమి చేయాలి**

**ఆశ్చర్యకరమైన సందర్శన:** మీరు మీ సోదరుడు ఉన్న అదే నగరంలో ఉన్నట్లయితే, వారిని సందర్శించడానికి ఇది సరైన సందర్భం, ప్రాధాన్యంగా అతనికి పాత కాలాన్ని గుర్తుచేసే చిన్న బహుమతితో.

**మెమరీ లేన్‌లోకి వెళ్లండి:** బాల్యం అని పిలువబడే మీ జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన దశను మళ్లీ సందర్శించండి మరియు మీ హృదయానికి దగ్గరగా ఉన్న జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకోండి. హృదయపూర్వకంగా నవ్వండి.

**కలిసి భోజనం చేయండి:** డిన్నర్ టేబుల్ వద్ద మాత్రమే చాలా సంభాషణలు జరుగుతాయి. రేపు లేదు అన్నట్టుగా మాట్లాడి మరి కొన్ని ఆనందకరమైన జ్ఞాపకాలు చేసుకోండి.

**మీ సోదరుడికి కాల్ చేయండి:** మీరు అదే నగరంలో లేకుంటే, మీ సోదరుడితో ఫోన్‌లో సుదీర్ఘంగా మాట్లాడినట్లు నిర్ధారించుకోండి.

**జాతీయ సోదరుల దినోత్సవ శుభాకాంక్షలు మరియు కోట్స్:**

మేము ఎల్లప్పుడూ అన్నింటికీ ఏకీభవించనప్పటికీ, మేము ఎల్లప్పుడూ హృదయం నుండి కమ్యూనికేట్ చేస్తాము. మీకు బ్రదర్స్ డే శుభాకాంక్షలు.

**సోదరుడిలా "మిత్రుడు లేడు". హ్యాపీ బ్రదర్స్ డే!**

"కొన్నిసార్లు ఒక సూపర్ హీరోగా ఉండటం కంటే సోదరుడిగా ఉండటం చాలా మంచిది." --- **మార్క్ బ్రౌన్**

ఆ వ్యక్తి లోపల ఒక చిన్న పిల్లవాడు నా సోదరుడు...ఓహ్, నేను ఆ చిన్న పిల్లవాడిని ఎలా ద్వేషించాను. మరియు నేను అతనిని ఎలా ప్రేమిస్తున్నాను --- **అన్నా క్విండ్లెన్**

"ఓ సోదరులారా! నేను సోదరులను పట్టించుకోను. నా అన్నయ్య చనిపోడు, నా తమ్ముళ్లు ఇంకేమీ చేయరు.

-- **అస్కార్ వైల్డ్, ది పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే**

"నువ్వు నీ తమ్ముడిని పట్టుకోవాలి . . . మరియు అతనిని పడనివ్వవద్దు, అది ఏమి జరుగుతున్నట్లు కనిపించినా మరియు అతనితో మీరు ఎంత చెడు చేసినా సరే." -- **జేమ్స్ బాల్డ్విన్, సోనీస్ బ్లూస్**

"ఇది నా సోదరుడు, నా రక్తం, నేను సృష్టించబడిన దాని నుండి ఈ ప్రపంచంలో సృష్టించబడిన ఏకైక విషయం, ఈ ప్రపంచంలో నన్ను బాగా తెలిసిన వ్యక్తి, నేను పోయినట్లయితే నన్ను ఎక్కువగా మిస్ అయ్యే వ్యక్తి." -- **జేమ్స్ ఫ్రే, ఎ మిలియన్ లిటిల్ పీసెస్.**

# సినిమా



## తండెల్ 'చైతూ'.. పక్కా లోకల్ బాయ్



టాలీవుడ్ కుర్ర హీరోలు ప్రస్తుతం తమ మార్కెట్ ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా కొత్త కథలని ఎంపిక చేసుకుంటున్నారు. యూనివర్శల్ కాన్సెప్ట్ లతో పాన్ ఇండియా రేంజ్ లో సినిమాలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య కూడా అదే రూట్లో వెళుతున్నాడు. ఇక ప్రస్తుతం కొత్త లుక్ తో ఎట్రాక్ట్ చేస్తున్నాడు. నాగ చైతన్య చందూ మొండేటీ దర్శకత్వంలో తండేల్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా కోసం ఫుల్ గా గెడ్డం పెంచేసి మాస్ లుక్ లో దర్శనం ఇస్తున్నాడు. రియలిస్టిక్ సంఘటనల స్ఫూర్తితో ఈ మూవీ తెరకెక్కుతూ ఉంది. భారీ బడ్జెట్ తో గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో చైతూకి జోడీగా సాయి పల్లవి నటిస్తోంది. గెడ్డంతో నాగ చైతన్య లుక్స్ చాలా మాసివ్ గా ఉన్నాయనే మాట వినిపిస్తోంది. చైతూ రాజు ఒక మత్స్యకారుడి పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ఇక లేటెస్ట్ స్టిల్ లో బోటులో నవ్వుతూ కనిపించిన చైతన్య తాడును పట్టుకొని ఉన్నాడు. మెడలో ఎర్రటి తుండుతో పక్కా లోకల్ అనేలా దర్శనమిచ్చాడు. ఈ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తండేల్ సినిమా షూటింగ్ సెట్ లో ఈ ఫోటో దిగినట్లు తెలుస్తోంది. తండేల్ మూవీ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ కి మంచి పాజిటివ్ టాక్ వచ్చింది. దీంతో సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పెరిగిపోయాయి. కచ్చితంగా ఈ సినిమాతో నాగ చైతన్య బ్లాక్ బస్టర్ హిట్ కొడతాడనే మాట వినిపిస్తోంది. శ్రీకాకుళం బ్యాక్ డ్రాప్ నడవబోయే ఈ మూవీలో చైతన్య ఫిషర్ మెన్ గా కనిపించబోతున్నాడు. తండేల్ సినిమాలో చైతూ లుక్ కొత్తగా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ సినిమా తర్వాత విరూపాక్ష ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య ఒక సినిమా చేయబోతున్నాడు. ఈ మూవీ కూడా విరూపాక్ష తరహాలోనే థ్రిల్లర్ జోనర్ లో ఉండబోతోందని టాక్ వినిపిస్తోంది. కార్తిక్ దండు విరూపాక్షతో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో చైతూతో కార్తీక్ దండు చేయబోయే సినిమా ఎలా ఉండబోతోందా అనే ఆసక్తి అందరిలో నెలకొని ఉంది. ఈ ఏడాదిలోనే కార్తీక్ దండు దర్శకత్వంలో మూవీ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక తండేల్ మూవీ ఈ ఏడాది ఆఖరులో డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకి రానుంది. తండేల్ సినిమా సక్సెస్ అయితే పాన్ ఇండియా రేంజ్ లో నాగ చైతన్య మార్కెట్ అమాంతం పెరిగే అవకాశం ఉంటుంది. మరి అతను ఎలాంటి రికార్డులు అందుకుంటాడో చూడాలి.

## ఆ అమ్మాయిల కోసమే పెళ్లి చేసుకోలేదు: ప్రభాస్



డార్లింగ్ ప్రభాస్ 'కల్కి 2898 AD' విడుదలకు సిద్ధమవుతున్న క్రమంలో అతడు ప్రచార కార్యక్రమాల్లో బిజీ అవుతున్నాడు. రామోజీ ఫిలింసిటీలో జరిగిన భారీ ప్రచార వేదిపై అతడు ప్రత్యేక వేషధారణతో సినిమాలో తన పాత్ర థీమ్‌ని ఎలివేట్ చేసే దుస్తుల్లో కనిపించాడు. ఇక ఇదే వేదికపై బుజ్జి అనే రోబో (కీలక పాత్ర)ను సూపర్ కార్ ని పరిచయం చేయడం ఆసక్తిని కలిగించింది. ఈ ఈవెంట్‌కి సుమ యాంకరింగ్ మరో ప్రధాన ఆకర్షణగా మారింది. సుమ ఎప్పటిలానే తనదైన శైలిలో అద్భుత టైమింగ్ తో అందరినీ నవ్వించారు. ఈవెంట్ కి విచ్చేసిన ప్రభాస్, నాగ్ అశ్విన్ సహా చిత్రబృందాన్ని ఇంటర్వ్యూలు చేసారు. ఈ ఇంటర్వ్యూలో ప్రభాస్ పెళ్లి గురించిన టాపిక్ అభిమానులను ఆటపట్టించింది. అమ్మాయిల గుండెలు పగిలిపోయాయి! అంటూ సుమ సరదాగా ఆటపట్టించారు. మొన్న మీరు ఒక ట్వీట్ చేసారు కదా.. లైఫ్ లోకి ఒకరు వస్తున్నారని.... ఎంతమంది అమ్మాయిల గుండెలు పగిలిపోయాయో తెలుసా? అంటూ ప్రభాస్‌ని ఆటపట్టించగా.. దానికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ అమ్మాయిల కోసమే పెళ్లి చేసుకోలేదని ప్రభాస్ నవ్వేశారు. దర్శకుడు నాగ్ అశ్విన్ గురించి ప్రస్తావిస్తూ -బక్క డైరెక్టర్- 3 ఏళ్లు బుజ్జితో టార్చర్ పెట్టాడని సరదాగా వ్యాఖ్యానించారు.. ఏదో హాయ్ చెప్పి వెళ్లిపోదామనుకుంటే.. ఈ కార్లు.. ఈ వాహనాలు ఏంటి సర్ ఇది? అని నాగ్ అశ్విన్ ని సరదాగా ప్రశ్నించారు. బుజ్జిని నాకు తగిలించాడు మూడు సంవత్సరాలు..అని కూడా అన్నారు. బుజ్జి బ్రెయిన్ ఉత్తమమా? లేదూ బాడీయే బెటరా? అని సుమ ప్రశ్నించగా.. బుజ్జి బాడీయే బెటర్.. ఇంత చిన్న బ్రెయిన్ అయినా నా బుర్ర తినేసింది. అందుకే బాడీ బెటర్..! అని ప్రభాస్ అన్నారు.

## యంగ్ గ్లోబల్ లీడర్ గా ఆ హీరోయిన్ !



బాలీవుడ్ హాట్ బ్యూటీ భూమీ పడ్నేకర్ వరుస విజాయాలతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది అమ్మడు ఏకంగా నాలుగు రిలీజ్ లతో మంచి ఫలితాలే సాధించింది. 'భీడ్' ..' అఫ్వా' ..' థాంక్యూ ఫర్ కమింగ్' ..'ది లేడీ కిల్లర్' లాంటి విజయాలతో మెప్పించింది. ఇటీవల రిలీజ్ అయిన క్రైమ్ థ్రిల్లర్ 'భక్షక్' తోనూ మరో విజయం ఖాతాలో వేసు కుంది. లైంగిక వేధింపుల నుండి బాలికలను రక్షించే జర్నలిస్ట్ పాత్ర లో నటించి విమర్శకుల ప్రశంసలందు కుంది. దీంతో భూమీకి అవకాశాల జోరు అంతకంతకు పెరుగుతుంది. కొత్త ఛాన్సులు క్యూలో ఉన్నా డేట్లు ఇవ్వలేని పరిస్థితి కనిపిస్తుంది. సరిగ్గా ఇదే సమయంలో అమ్మడికి అరుదైన గౌరవం కూడా దక్కింది. ప్రపంచ ఆర్థిక వేదిక యంగ్ గ్లోబల్ లీడర్ గా కొత్త ఛాన్స్ తీసుకుంటుంది. క్లైమేట్ వారియర్ అండ్ భూమీ ఫౌండేషన్ ద్వారా పర్యావరణానికి చేస్తోన్న విశేష సేవలకు గానూ యంగ్ గ్లోబల్ లీడర్ గా భూమీ పడ్నేకర్ ని ఎంపిక చేసినట్లు వర్లడ్ ఎకనామిక్ ఫోరం ప్రకటించింది. రాజకీయాలు, వ్యాపారం, పౌర సమాజం, కళలు, విద్యాసంస్థలకు చెందిన కొందరు ప్రముఖుల పేర్లను డబ్ల్యూ ఈఎఫ్ ప్రకటించింది. దీంతో భూమీ పడ్నేకర్ 2025 లో జరిగే ప్రఖ్యాత దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భూమీ భారత్ తరుపున ప్రాతినిధ్యం వహిస్తూ ప్రసగించనుంది. అలాగే ఇదే ఏడాది సింగపూర్ సదస్సులోనూ ఆమె ప్రసగించనున్నారు. ఈ సందర్భంగా భూమీ పడ్నేకర్ సంతోషం వ్యక్తం చేసింది. 'నా ఎంపికను ఓ గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. పర్యావరణ ప్రేమికురాలిగా, నటిగా ప్రపంచ వేదికగా నా వాణి బలంగా వినిపిస్తాను' అని అన్నారు. ప్రస్తుతం భూమీ పడ్నేకర్ చాలా సినిమాలకు కమిట్ అయింది. వాటిలో కొన్ని సెట్స్ కి వెళ్లాయి. మరికొన్ని త్వరలో ప్రారంభం కానున్నాయి.

## ఎన్టీఆర్-చరణ్ తర్వాత శింబుతో.. జాన్వీ



అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలు జాన్వీ కపూర్ సౌత్‌లో వడివడిగా అడుగులు వేస్తోంది. కెరీర్ ఆరంభమే టాలీవుడ్ సూపర్ స్టార్లు ఎన్టీఆర్, చరణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. దేవరలో ఎన్టీఆర్ తో రొమాన్స్ చేస్తున్న జాన్వీ, తదుపరి చరణ్ - బుచ్చిబాబు చిత్రంలోను నటిస్తోంది. జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ తెరకెక్కిస్తే అందులో కచ్చితంగా జాన్వీ కథానాయిక అని చరణ్ కన్ఫామ్ చేసాడు. దీనికోసం అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారని బుచ్చిబాబుతో సినిమా లాంచ్‌లో చరణ్ స్వయంగా అన్నారు. అదంతా అటుంచితే జాన్వీ ఇప్పుడు కోలీవుడ్ లోను అడుగుపెట్టబోతున్నట్టు కథనాలొస్తున్నాయి. ప్రతిభావంతుడైన సిలంబరసన్ అలియాస్ శింబు సరసన STR 48తో కోలీవుడ్‌లో అరంగేట్రం చేస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. శింబు తన తదుపరి చిత్రం కోసం దర్శకుడు దేశింగ్ పెరియసామితో చేతులు కలిపాడు. ఈ చిత్రానికి తాత్కాలికంగా STR 48 అని పేరు పెట్టారు. ఏడాది క్రితమే ప్రారంభమైన ఈ చిత్రం ప్రీ-ప్రొడక్షన్ పనికి ఎక్కువ సమయం పట్టింది. సోషల్ మీడియాలో తాజా సంచలనం ప్రకారం...STR 48లో కథానాయికల పాత్ర కోసం ఇద్దరు బాలీవుడ్ నటీమణులతో చర్చలు జరుపుతున్నారని తెలిసింది. నిర్మాతలు శింబు సరసన నటించేందుకు బాలీవుడ్ నటీమణులు జాన్వీ కపూర్, కియారా అద్వానీతో చర్చలు జరుపుతున్నారని సమాచారం. వారు ఇద్దరు నటీమణులతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నటించాల్సిందిగా చర్చించినట్టు కథనాలొస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే ఆ ఇద్దరిలో ఎవరికి అవకాశం అన్నది తేలాల్సి ఉంది. వారికి ఇది కోలీవుడ్ ఆరంగేట్రం అవుతుంది. ఈ ఇద్దరు నటీమణులు తమ తమిళ సినిమా ఎంట్రీ కోసం చాలా కాలం పాటు వేచి ఉన్నందున అభిమానులు తాజా వార్తలతో సంతోషిస్తున్నారు. వాస్తవానికి STR 48లో ఇంతకు ముందు వేరే పేర్లు వినిపించాయి. కీర్తి సురేష్, మృణాల్ ఠాకూర్ లేదా దీపికా పదుకొనే నటించవచ్చని కథనాలొచ్చాయి. ఇప్పుడు కియారా అద్వానీ లేదా జాన్వీ కపూర్ లకు ఛాన్సుందని అభిమానులు భావిస్తున్నారు. కానీ మేకర్స్ నుండి అధికారిక నిర్ధారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. శింబు ప్రస్తుతం మణిరత్నం దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు. కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న థగ్ లైఫ్ లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. STR 48 షూటింగ్ జూన్ చివరిలో ప్రారంభం కానుందని సమాచారం. మేకర్స్ ఇతర పనులను వేగవంతం చేశారు.

## ఒకే కంచం..మంచం అన్నట్లే ఒకే నెంబర్ కూడా!



జాన్వీకపూర్ - సారా అలీఖాన్ స్నేహం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు బాల్యం నుంచి స్నేహితులు. ఎంతో క్లోజ్‌గా ఉంటారు. బెస్ట్ ఫ్రెండ్స్ ఎవరంటే? వారిద్దరు వారి పేర్లే చెబుతారు. ఒకే మంచం..ఒకే కంచం అన్నంతగా ఇద్దరూ మెలుగుతారు. సినిమాల్లోకి రావడం దగ్గర నుంచి సక్సెస్ అవ్వడం ప్రతీది ఈక్వల్ అనేస్తారు. తాజాగా ఈ బ్యూటీలిద్దరు ఇండస్ట్రీలో ఎంత బిజీగా ఉన్నారో తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. 'ధడక్' సినిమాతో జాన్వీ కపూర్- 'కేధరనాద్' తో సారా అలీఖాన్ లాంచ్ అయ్యారు. మరి వీరిద్దరు ఇప్పటివరకూ ఎన్ని సినిమాలు చేసారంటే? కచ్చితంగా ఆ నెంబర్ మారే ఉంటుందనుకుంటారంతా. ఒకరు ఎక్కువ చేయడానికి లేదా తక్కువగా చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ ఈ ఫ్రెండ్స్ ఆ ఛాన్స్ కూడా ఇవ్వలేదు. ఇద్దరు కూడా ఒకే నెంబర్ మెయింటెన్ చేసారు. జాన్వీ కపూర్ 13 సినిమాలు చేస్తే..సారా అలీఖాన్ కూడా 13 సినిమాలే చేసింది. అలా స్నేహితురాళ్లు ఇద్దరు ఒకే నెంబర్ ని మెయింటెన్ చేస్తున్నారు. మరి యాదృశ్చికంగా జరిగిందా? లేక అనుకునే చేస్తున్నారా? అన్నది వాళ్లకే తెలియాలి. ప్రస్తుతం జాన్వీ కపూర్ నాలుగు సినిమాలతో బిజీగా ఉంది. అందులో ఒక తెలుగు సినిమా ఉంది. అదే 'దేవర'. ఈ సినిమాతో పాన్ ఇండియాలో లాంచ్ అవుతుంది. ఇక సారా అలాఖాన్ మూడు సినిమా షూటింగ్ లోతో బిజీగా ఉంది. తెలుగులోనూ లాంచ్ అవ్వాలని వెయిట్ చేస్తోంది. జాన్వీ కపూర్ ద్వారా ఇక్కడి అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. బాలీవుడ్ లో మాత్రం ఇటీవలే మరో రెండు సినిమాలకు సైన్ చేసినట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. ఓసినిమాలో సాహసోపేతమైన పాత్ర పోషిస్తుందని వినిపిస్తుంది. ఇంతవరకూ అలాంటి పాత్రను ఏ నటి పోషించలేదని ప్రచారం సాగుతోంది. కానీ ఆ సినిమా వివరాలు మాత్రం గోప్యంగా ఉన్నాయి. అలాగే అన్ని అనుకూలిస్తే స్నేహితులిద్దరు ఒకే ఇంటికి తోడికోడళ్లగానూ వెళ్లే అవకాశం ఉంది.

# స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమాలలో బీచ్ వీధి వర్తకులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖ సముద్ర తీర పరిశుభ్రతకు మేము సైతం అంటూ విశాఖ నగర బీచ్ వీధి వర్తకుల సంక్షేమ సంఘం స్వచ్ఛందంగా సహకార మందించడం అభినందనీయమని జివిఎంసి 3వ జోన్ వైద్య, ఆరోగ్య సహాయక అధికారి బి.ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం ఆయన జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు విశాఖ కోస్టల్ బ్యాటరీ నుండి పార్కు హోటల్ వరకు ఉన్న వీధి వర్తకులతో స్వచ్ఛ సర్వేక్షణపై అవగాహన కార్యక్రమాలు బీచ్ రోడ్డు అన్నమయ్య పార్కు ప్రాంతం లో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎ.ఎం.ఒ.హెచ్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ విశాఖ సముద్ర తీర ప్రాంతం మన నగరానికి ప్రకృతి వరమని, దీనిని కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తీర ప్రాంతంలోని వీధి వ్యాపారులు విశాఖ స్వచ్ఛతకు మేము సైతం అంటూ విశాఖ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమని, అందుకు వారికి సముద్ర తీర ప్రాంత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. సుందర విశాఖ నగరానికి నిత్యం పర్యాటకులు, సందర్శకులు సందర్శిస్తున్నందున వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో బీచ్ వీధి వర్తకుల వారి బాధ్యతగా భావించి బీచ్ తీరం లో వ్యర్థాలు పడవేయకుండా సందర్శకులకు అవగాహన కల్పించాలని వారికి సూచించడమైనదని ఎ.ఎం.ఒ.హెచ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహావిశాఖనగర పాలకసంస్థ వైద్య ఆరోగ్య శాఖ నుండి శానిటరీ సూపర్ వైసర్ బి.సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ గోవింద్, విశాఖనగర బీచ్ వీధివర్తకుల సంక్షేమ సంఘం నుండి సి.హెచ్. రమణ, గిదితురు శ్రీను, తెడ్డు శంకరరావు తదితర వీధి వర్తకులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 800 పోలీసులతో కలిసి



ఛత్తీస్‌గఢ్ నారాయణ్‌పూర్, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇప్పటి వరకు ఇద్దరు మావోయిస్టులు చనిపోయినట్లు అధికారిక సమాచారం అందుతోంది. మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అబూజ్‌మడ్ రెక్వాయా అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. 800 మంది పోలీస్ బలగాలతో ఈ భారీ ఆపరేషన్ చేపట్టారు. మావోయిస్టులను పట్టుకునేందుకు భద్రతా దళాల సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చేపట్టిన కగార్ ఆపరేషన్ కొనసాగుతోంది.

ఇదిలాఉంటే.. నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలిపేందుకు ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, హోంమంత్రి విజయ శర్మ నూతన ప్రయత్నం చేస్తున్నారు. గురువారం ఉదయం విజయ శర్మ నక్సలైట్లకు బహిరంగ పిలుపునిస్తూ లేఖ రాశారు. నక్సల్ పునరావాస విధానంలో మార్పు కోసం నక్సలైట్‌ల నుండి ప్రభుత్వం సూచనలు కోరింది. ప్రభుత్వం ముందు లొంగిపోయే నక్సలైట్లు తమ వివరాలు తెలిపేందుకు డిప్యూటీ సీఎం విజయ్ శర్మ ఈమెయిల్ ఐడీ, గూగుల్ ఫామ్‌ను విడుదల చేశారు. నక్సల్స్ నుంచి సూచనలు కోరుతూ ఈమెయిల్ ద్వారా విజ్ఞప్తులను స్వీకరిస్తోంది. మావోయిస్టుల లొంగుబాట్లను ప్రోత్సహించేలా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చెబుతోంది.

# ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జూన్ 4వ లేదీన అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పూర్తి సహాయ సహకారాలను అందిచాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి కోరారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో ఈ విషయమై అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల లో పోటీలో వున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి. మురళీ కృష్ణతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్లమెంటు నియోజకవర్గంలో భాగమైన పెందుర్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ లో జరుగుతుందన్నారు. కౌంటింగ్ హాల్ లోనికి ప్రవేశం, అసెంబ్లీ, పార్లమెంట్ టేబుళ్ల అమరిక మొదలైనవి అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. నిర్ణీత సమయాల్లో వారు వచ్చి ఏర్పాట్లను, రాక, పోకలనుగూర్చి తెలుసుకోవచ్చని చెప్పారు. కౌంటింగ్ కు హాజరయ్యే ఏజెంట్లు తప్పని సరిగా పాస్ లు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్ లను కేంద్రంలోనికి తీసుకు వెళ్లరాదని కనుక తమ సెల్ ఫోన్ లు తీసుకు రావద్దని చెప్పారు. అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధిత ఆర్వోలు, ఎంపీ నియోజకవర్గానికి డి.ఆర్.ఓ. పాస్ లు మంజూరు చేస్తారని చెప్పారు. పోలీసు సూపరిటెండెంట్ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మన జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, అందరూ సంయమనం పాటించినందుకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీల వారు సహకరించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి సుహృద్భావ వాతావరణంలో ఎటువంటి ఘర్షణలకు, హింసకు తావివ్వకుండా ఇతరుల భావోద్వేగాలను ప్రేరేపించకుండా చట్టాలను గౌరవిస్తూ, నిబంధనకు కట్టుబడి జిల్లాలో మొత్తం ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా జరగాలన్నారు. ఒకటవ తేదీ నుండి టీవీలలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారమవుతాయని, ఆరోజు నుండి శాంతి భద్రతల పర్యవేక్షణకు ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద త్రీటైర్ భద్రత వుంటుందని, మొబైల్ ఫోన్ లు ఎవరికీ అనుమతించ బడవని చెప్పారు. కౌంటింగ్ హాలులో క్రమశిక్షణతో ఉండాలన్నారు. పికెట్లు, చెక్ పోస్టులు మరింత కట్టుదిట్టం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ఆర్డీవోలు ఎ.చిన్నికృష్ణ, హెచ్.వి.జయరామ్, ఆర్.వోలు మనోరమ, గీతాంజలి, సత్యవాణి, అనకాపల్లి పార్లమెంటు, జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాల్గొన్నారు.

Authorised
System Solution Provider for
VOLTAS
A TATA Enterprise
Md. Ibrahim Khaleel
M: 094402 11943
9 Planet Solutions
HVAC - VRF PROJECTS SALES & SERVICES
Our Services that will make you cool
Head Office
Plot No.P-58, Flat No.101, Taj Residency
Ashok Vihar Colony, Upparpally,
Hyderabad-500030, Telangana State,
E: 9planetsolutions2009@gmail.com
Branch Office
#13-2-18/4,Anthony Nagar,
Beside St.Anthony's High School,
Maharanipeta,Visakhapatnam-530002
Andhra Pradesh.

# బ్యాటరీతో పనిచేసే 5 బ్యాటరీ కార్లను కేజీహెచ్‌కు అంద చేసిన ఆర్ఐఎన్ఎల్






**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రోగుల రవాణా కోసం 24/7 (రౌండ్ ది క్లోక్ ) -విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ డా.ఎ.మల్లికార్జున, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, విశాఖపట్నం మరియు డైరెక్టర్ (ప్రాజెక్టు) మరియు అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ శ్రీ ఎకె బాగ్చి గారిచే లాంఛనంగా ప్రారంభోత్సవం.

కేజీహెచ్ ఆవరణలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యొక్క కార్పొరేట్ సంస్థ అయిన ఆర్ఐఎన్ఎల్ సీఈఆర్ (కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ రెస్పాన్సిబిలిటీ ఇనిషియేటివ్) లో భాగంగా కేజీహెచ్, వైజాగ్ కోసం 5 నంబర్ల బ్యాటరీతో నడిచే వాహనాలను అందించింది.

డా.ఎ.మల్లికార్జున, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, విశాఖపట్నం, డైరెక్టర్ (ప్రాజెక్టు) మరియు అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ శ్రీ ఎకె బాగ్చి సంయుక్తంగా బ్యాటరీ కార్లను ప్రారంభించారు. బ్యాటరీతో నడిచే ఈ 5 కార్ల ధర దాదాపు రూ.40 లక్షలు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లిఖార్జున మాట్లాడుతూ ఎంతో సేవా తత్పరతతో రోగులకు ఎంతగానో సహాయ పడే బ్యాటరీ కార్లను విశాల హృదయంతో ముందుకు వచ్చి కేజీహెచ్‌కు అందచేసినందుకు ఆర్ఐఎన్ఎల్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ యాజమాన్యాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లిఖార్జున ప్రత్యేకంగా ప్రశంసించారు. రోగులకు ఎంతగానో సహాయ పడే బ్యాటరీ కార్లను అందచేసినందుకు డాక్టర్ పి అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్ విశాఖ ఉక్కు కర్మాగార యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియ చేశారు.

ఈ సందర్భంగా డా.ఎ.మల్లికార్జున, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ విశాఖ ఉక్కు కర్మాగారం డైరెక్టర్ (ప్రాజెక్టు) మరియు అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ శ్రీ ఎకె బాగ్చి కు ప్రత్యేక జ్ఞాపిక అందచేశారు.

ఈ సందర్భంగా విశాఖ ఉక్కు కర్మాగారం డైరెక్టర్ (ప్రాజెక్టు) మరియు అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ శ్రీ ఎకె బాగ్చి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారం సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తోందని, ఇటువంటి ఒక ఉదాత్తమమైన కార్యక్రమం లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీ ఏ కె బాఘ్చి తెలియచేసారు. అనంతరం డా.ఎ.మల్లికార్జున, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ విశాఖ ఉక్కు కర్మాగారం డైరెక్టర్ (ప్రాజెక్టు) మరియు అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఆర్ఐఎన్ఎల్-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ శ్రీ ఎకె బాగ్చి స్వయంగా బ్యాటరీ కార్లను కేజీహెచ్ ప్రాంగణం లో నడిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సి బిలిటీ విభాగం ఈ కార్యక్రమాన్ని సమన్వయపరిచింది.

ఆర్ఐఎన్ఎల్ కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ రెస్పాన్సిబిలిటీ చొరవ కింద విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్కు పర్యావరణ అనుకూలమైన బ్యాటరీతో నడిచే వాహనాలు (2 సంఖ్యలు. వీల్చైర్ అలవెన్స్ వాహనాలు మరియు 3 సంఖ్యలు 6-సీటర్ వాహనాలను విశాఖ ఉక్కు కర్మాగారం అందచేసింది.

ఈ 5 బ్యాటరీతో నడిచే కార్లు కేజీహెచ్ ఆసుపత్రిలో పేదలు, వృద్ధులు, వికలాంగులు, గాయపడిన వారు, గర్భిణీ స్త్రీలు, తల్లి & బిడ్డ ఇతర నిరుపేదలు కేజీహెచ్ ఆవరణలో అంటే క్యాజువాలిటీ/ ఓపి వార్డుకు సంబంధిత విభాగాలు/ వార్డులు/ ల్యాబ్లు/ డయాగ్నస్టిక్ సెంటర్లు మొదలైనవాటికి నిర్దేశించిన వైద్య ప్రక్రియ ప్రకారం. 3- షిఫ్టు మరియు జనరల్ షిఫ్టులో రోగులు మరియు వారి అటెండెంట్ల రవాణాకు బాగా సహాయపడతాయి. కేజీహెచ్ వద్ద, విశాఖపట్నం మరియు ఆంధ్రప్రదేశ్ మరియు పొరుగు రాష్ట్రాలైన ఒరిస్సా మరియు ఛత్తీస్గఢ్ జిల్లాల నుండి ప్రతిరోజూ సుమారు 2,000 మంది రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ప్రతిరోజూ దాదాపు 1475 మంది రోగులు 27 ఎకరాల విస్తీర్ణంలో వివిధ ప్రాంతాలలో విస్తరించి ఉన్న కేజీహెచ్ యొక్క వివిధ వార్డులు, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలు, ప్రయోగశాలలు మొదలైన వాటికి ఆరోగ్య సంబంధమైన సహాయానికి వెళుతున్నారు.

ప్రవీణ్ కుమార్, సీజీఎం (సర్వీసెస్), ఆర్ఐఎన్ఎల్ డాక్టర్ పి అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్, డాక్టర్ జి. బుచ్చి రాజు, ప్రిన్సిపాల్, ఆంధ్ర మెడికల్ కాలేజీ, శ్రీ సి హెచ్ శ్రీనివాస రావు, అసిస్టెంట్ డైరెక్టర్ , కేజీహెచ్, డాక్టర్ ఈ వి ఆర్ రాజు, ఎక్స్పర్ట్ అడ్వైసోరీ కమిటీ మెంబర్, మినిస్ట్రీ అఫ్ ఎన్విరాన్మెంట్ , ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్, విశాఖ ఉక్కు కర్మాగారం, ఆర్ఐఎన్ఎల్ యొక్క సీనియర్ అధికారులు, కేజీహెచ్ యొక్క అనేక మంది సీనియర్ వైద్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 26-05-2024, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 3.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
:9393949345, 8074541283
Compli

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
Office : 99487 49799. Arilova : 73825 85777 Maddilapalem : 99084 24231, Yelamanchili : 9441356676